# జనపదం

J A N A P A D H A M

తెలుగు దినపత్రిక


హైదరాబాద్ | శనివారం 19 అక్టోబర్ 2024 | సంచిక: 1 సంపుటి: 131


## ఆయియే ఆదానీ జీ.. యే లేలో రేవంత్ జీ..



- స్కిల్ యూనివర్సిటీకి ఆదానీ గ్రూప్ భారీ విరాళం
- 100 కోట్ల సాయం అందజేసిన గౌతమ్ అదానీ
- సీఎం రేవంత్ రెడ్డికి చెక్కు అందజేత
- యువతకు ఉపాధే లక్ష్యం..
- నవంబర్ 4 నుంచి కోర్సులు ప్రారంభం

..........వివరాలు 4లో



## నేనొస్తా.. నువ్వూ రా...

- టైం, ప్లేస్ నువ్వే చెప్పు.. సెక్యూరిటీ లేకుండా వస్తా అన్నావ్ కదా..
- మాట్లాడడం కాదు., చేసి చూపాలి.. సీఎంపై హరీష్ ఫైర్..
- మూసీ స్టంట్ బాగుందని సెటైర్..
- రెజునెవేషనా.. రివర్ ఫ్రంటా..? ఏది నిజమో..
- మూసీ వెంట ప్రజల గోడు పట్టదా అని నిలదీత..
- రియల్ ఎస్టేట్ పేరుతో సీఎం దగా చేస్తున్నాడని ఆగ్రహం...

**జనపదం, బ్యూరో**

''సుందర అద్భుతమంతా నగరంలోనే ఉంది. ప్రపంచ సౌందర్యమంతా హైదరాబాద్ నుంచి నేర్చుకుంది. అసలు మనం రాజధాని నగరంలో ఉన్నామా.., విదేశాల్లోని మరే సిటీలో తేలుతున్నామా..? ఇంత బాగా చూపించిన మీ చాతుర్యం అమోఘం. ఇంతకీ మీరు చూపిన ఆ వీడియోలోనే రివర్ రిజునెవేషన్ అండ్ రివర్ ఫ్రంట్ అని రెండు మాటలు కనిపించాయి. రిజునెవేషన్ అంటే పునరుజ్జీవనమే., మరీ ఈ ఫ్రంట్ కథేమిటి ముఖ్యమంత్రి మహాశయా..? ఆ ఫ్రంట్ వెనక మీ అసలు స్టంటు కూడా ఏమిటో సెలవిస్తే ప్రజలకు ఓ క్లారిటీ ఉంటుంది., మాలాంటోరి వివరణ ఇచ్చిన వారు అవుతారు..'' అని మాజీ మంత్రి ......(తరువాయి 2లో)

# మూసీపై ముష్టియుద్ధం..

## కంపు రేపుతున్న పార్టీల పైత్యం..

### సిగపట్లకు దిగుతున్న నాయకులు..

### ఎవరి లెక్కల్లో వాళ్లు.. ఎదుటివారిపై తప్పుల నిందలు..

### రాజకీయానికి వేదికగా రాజధాని నది..

### ప్రజలకు ఒరిగింది శూన్యం..

4

కంపుకు కేరాఫ్ గా మారిన మూసీ కంటే వాళ్ల తీరు ఇంకా కంపరం రేపుతున్నది. నాయకులు నోరు తెరిస్తే చాలు భరించలేని కంపు బయటకొస్తున్నది. శుద్ధీకరణో.., సుందరీకరణో.., అదీ కాదంటే పునరుజ్జీవనమోగానీ... గీత దాటుతున్న మాటలతో మూసీ చుట్టు రాజకీయం రోజురోజుకు ముదురుతూనే ఉన్నది. వాళ్లు చేశారని వీళ్లు., వీళ్లు చేశారని ఇంకొకళ్లు.., ఒకరిపై ఒకరు మూసీ నీళ్లు చల్లకుంటూ మురుగు ను ఆశ్వాదిస్తున్నారు. మరోవైపు సర్కార్ దుందుడుకుతో గుండెలాగుతున్న సామాన్యుడి గోడు మాత్రం ఆ దేవుడికే తప్ప నాయక ఘనుడికి పట్టింది లేదు. ఓట్ల రూపకపు సానుభూతి కోసం సన్నాయి నొక్కులు నొక్కడమే తప్ప, నిక్కచితనపు పోకడతో పరిష్కారం దిశగా అడుగులు వేసేది అతి తక్కువే అని ఎప్పుడో తేలిపోయింది. రంగుల జెండాలను మూసీ లో ముంచి జనం సింపథిని పొందడానికి ఆ నీటిని పిండుతూ ఆనందించడం వారి వంతు అవుతుండగా, ఆ గుడ్డ పిండిన నీటి కంపు మాత్రం ప్రజల నెత్తిన ఇంకా పిడుచకట్టుకుపోతున్నది.



## మూసీ లూటీఫికేషన్

- బ్యూటిఫికేషన్ పేరిట మోసం...
- మూసీ మాటున లక్షన్నర కోట్ల దోపిడీకి ప్రయత్నం
- సీఎంకు మూసీపై ప్రేమంతా ఢిల్లీకి మూటలకే..
- అప్పుడు నోట్ల రద్దుపై బడేబాయి చెప్పిండు..
- ఇప్పుడు మూసీపై చోటే బాయ్ రోజుకోటి చెబుతాండు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్..
- తెలంగాణ భవన్‌లో మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

4

**జనపదం, హైదరాబాద్ బ్యూరో:**

మూసీ బ్యూటిఫికేషన్ కాదు అది పక్కా లూటీఫికేషన్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేసీఆర్ మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సుందరీకరణ పేరుతో లక్షన్నర కోట్ల దోడిపి చేయాలన్నదే సీఎం రేవంత్ లక్ష్యమన్నారు. అందుకే ఈ ప్రాజెక్టునే రేవంత్ గట్టిగా పట్టుకున్నాడన్నారు. అసలు మూసీపై ఆయన ఎలాంటి ప్రేమ లేదని ఉన్నదంతా ఢిల్లికి మూటలు పంపడానికేనని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలంగాణభవన్ లో మూసీపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మూసీ పరివాహక ......(తరువాయి 2లో)

## నిర్వాసిత మహిళలకు రుణాలు

- ఒక్కొక్కరికి రూ.2 లక్షలు
- రూ.1.40 లక్షలు సబ్సిడీ
- చెక్కులను అందించిన మంత్రి సీతక్క
- మహిళలకు వ్యాపారాల కోసం రుణాలు ఇస్తున్నాం
- మూసీ పరివాహకంలో కాకుండా మంచి వాతావరణంలో బతకాలి : మంత్రి సీతక్క



4

## కాంగ్రెస్ ఆదరణకు కడుపు మంట..

- మూసీ ప్రక్షాళన చేస్తుంటే అభ్యంతర మెందుకో..
- 2028 ఎన్నికల వరకు గ్రేటర్ లో హస్తమే మిగులుతుంది..
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి
- బీఆర్ఎస్ నిరసనలపై తీవ్ర ఆగ్రహం..



3

## మూసీ నీళ్లతో స్నానం చేయండి..

- అప్పటి వద్దనిపిస్తే వదిలేస్తాం..
- పార్టీ మారగానే ఈటలకు మతి భ్రమిస్తున్నది..
- ఎంపీ రాజేందర్ పై ఎంపీ చామకూర కిరణ్ కుమార్ ఫైర్..
- ప్రక్షాళన జరిగి తీరుతుందని ప్రకటన..



## సుందరీకరణకు వ్యతిరేకం కాదు..

- ముందు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించండి
- పేదల ఇండ్లను కూడా కూల్చవద్దు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



4

## ప్రక్షాళన పేరుతో విధ్వంసం

- మూసీ పేరుతో రాష్ట్ర సర్కార్ పైశాచికం..
- ఈ నెల 23, 24 తేదీల్లో పరిశీలన..
- 25న పలు కార్యక్రమాలు..
- బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



2

# లాఠీ.. లడాయి..

- గ్రూప్ 1 అభ్యర్థులపై విరిగిన లాఠీ...
- హైకోర్టులో తుది విచారణ
- సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన హైకోర్టు డివిజన్ బెంచ్
- పిటిషన్లన్నీ కొట్టేసిన న్యాయస్థానం
- వెంటనే సుప్రీం కోర్టులో పిటిషన్ వేసిన అభ్యర్థులు
- సోమవారం విచారణ..
- అశోక్ నగర్లో మళ్లీ ఆందోళన



**జనపదం, హైదరాబాద్ సిటీ:**

గ్రూప్–1 మెయిన్స్ వివాదం ముగియడం లేదు. రద్దు కోసం అభ్యర్థులు పట్టుపడుతుండగా.. నిర్వహించి తీరుతామని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో అభ్యర్థులు కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. హైకోర్టులో సింగిల్ బెంచ్, డివిజన్ బెంచ్లో ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు రావడంతో.. సర్వోన్నత న్యాయస్థానం మెట్లు ఎక్కారు. మరోవైపు, అభ్యర్థులు ఆందోళన కొనసాగిస్తున్నారు. వారికి ఆయా రాజకీయ పార్టీలు మద్దతుగా నిలుస్తున్నాయి. శుక్రవారం హైదరాబాద్‌లో మరోసారి ఉద్రిక్తత చెలరేగింది. గ్రూప్–1 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ అభ్యర్థులు రోడ్లపైకి వచ్చి ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, అశోక్‌నగర్, ఇందిరాపార్క్ ఏరియాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. దీంతో పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు. షాపుల్లోకి వెళ్లిన అభ్యర్థులను బయటకు లాక్కొచ్చారు. అలాగే అభ్యర్థులపై లాఠీచార్జి కూడా చేశారు. అక్టోబర్ 21 నుంచి గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు జరగనున్న సంగతి తెలిసిందే. ఈ పరీక్షలు వాయిదా వేయాలని మరోసారి ఆందోళనలు చెలరేగడం చర్చనీయాంశమవుతోంది.

**సింగిల్ బెంచ్ తీర్పును సమర్థించిన హైకోర్టు డివిజన్ బెంచ్**


గ్రూప్– 1 మెయిన్స్ పరీక్షలు వాయిదా వేయాలన్న అభ్యర్థుల పిటిషన్లను హైకోర్టు డివిజన్ బెంచ్ కొట్టివేసింది. సింగిల్ బెంచ్ తీర్పును సమర్థిస్తూ గ్రూప్ –1 పరీక్షలకు లైన్ క్లియర్ చేసింది. యాథావిధిగా పరీక్షలు నిర్వహించాలని స్పష్టం చేసింది. దీంతో గ్రూప్– 1 అభ్యర్థులకు ఎదురుదెబ్బ తగిలింది. ఇటీవలే గ్రూప్–1 పరీక్షలు నిర్వహించుకోవచ్చని హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రిలిమ్స్‌లో 7 ప్రశ్నలకు ఫైనల్ కీ లో సరైన సమాధానాలు ఇవ్వ లేదని పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. వాటికి మార్కులు కలిపి కొత్త జాబితాను విడుదల చేయాలని కోరారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం పిటిషన్లను కొట్టివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రూప్–1 పరీక్షలు యధాతథంగా జరుపుకోవచ్చని స్పష్టం చేసింది. ఇటీవల మెయిన్స్......(తరువాయి 4లో)



## ఎందాకైనా కొట్లాడతా

- మీకోసం దేనికైనా రెడీ..
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలిపెట్టు
- గ్రూప్ 1 పరీక్షలను రీషెడ్యూల్ చేసేదాకా ఉద్యమిస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ
- అభ్యర్థులకు భరోసా..

4



## వీసీలొచ్చారు..

4

- 9 యూనివర్సిటీలకు వైస్ చాన్స్‌లర్ల నియామకం
- ఫుల్ టైం నియామకంతో సర్వత్రా హర్షం..
- ఓయూ వైస్ ఛాన్సలర్‌గా కుమార్



## ఉన్మాదాన్ని ఉపేక్షించొద్దు..

- అమ్మవారిపై దాడి విశ్వాసం మీద దాడే..
- సీఎం ఓట్ల రాజకీయం మాని దుర్మార్గుల పని పట్టాలి..
- హోటల్లో మీటింగ్ పెడితే ఇంటెలిజెన్స్ ఏం చేస్తోంది..?
- గుడి వైపు చూడాలంటే గజ్జుమనేలా చర్యలు తీసుకోవాలి
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

2

## బాల్య వివాహాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదని స్పష్టం కట్టడికి మార్గదర్శకాలు జారీ చేసిన ధర్మాసనం

3



# సోమవారం రండి..

**సురేఖపై పరువు నష్టం కేసు వాయిదా కేటీఆర్ అండ్ టీం ను 21న కోర్టుకు రావాలని ఆదేశాలు..**

మంత్రి కొండా సురేఖపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువునష్టం కేసు పెట్టిన విషయం తెలిసిందే. ఈ కేసులో నేడు కేటీఆర్ సహా నలుగురు సాక్షుల వాంగ్మూలాలను నాంపల్లి కోర్టు రికార్డు చేయాల్సి ఉంది. ఉదయం 11.30 గంటలకు కేటీఆర్ కోర్టుకు హాజరవుతారనుకుంటున్న క్రమంలో కేసు వాయిదా పడింది. పరువునష్టం కేసు విచారణను సోమవారానికి వాయిదా వేసింది. దీంతో ఆయన శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరు కాలేదు.

**- జనపదం, హైదరాబాద్ సిటీ**

## ఆలయాల భూములను పరిరక్షిస్తాం..

- త్వరలో స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేస్తాం
- ఆలయ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లు
- అన్ని దేవాలయాల వెబ్ సైట్లు ఒకే గొడుగు కిందకు తీసుకవస్తాం..
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

3



# ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే

రెండుగా చీలిన మానుకోట కాంగ్రెస్?

చిచ్చుపెట్టిన ఇందిరమ్మ కమిటీలు

పోటీపోటీగా సమావేశాలు..

లొల్లుకు కేంద్రంగా మారిన ఉమ్మడి వరంగల్

2

# ఉన్మాదాన్ని ఉపేక్షించొద్దు..

- అమ్మవారిపై దాడి అంటే మనవిశ్వాసం మీద దాడే..
- సీఎం ఓట్ల రాజకీయం మాని దుర్మార్గుల పని పట్టాలి..
- హోటల్లో మీటింగ్ పెడితే ఇంటెలిజెన్స్ ఏం చేస్తోంది..?
- గుడి వైపు చూడాలంటే గజ్జుమనేలా చర్యలు తీసుకోవాలి
- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



**జనపదం, సికింద్రాబాద్:** ఉన్మాదాన్ని ఏ మతం సహించదని.., ఉన్మాదాన్ని అణచకపోతే ప్రపంచానికి ముప్పు అని వీటిని ఉపేక్షిస్తే చరిత్ర క్షమించదని, సీఎం రేవంత్ రెడ్డి దిక్కుమాలిన ఓట్ల రాజకీయం మాని వారి పని పట్టండి అంటూ ఎంపీ ఈటల రాజేందర్ సూచించారు. సికింద్రాబాద్ లోని కుమ్మరగూడ ముత్యాలమ్మ అమ్మ వారి ఆలయాన్ని సందర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రక్షపురంలో భూలక్ష్మి అమ్మ వారు, ఉప్పుగూడ దేవాలయం, మైలార్ దేవ్ పల్లి ఆలయం, ఎగ్జిబిషన్ లో అమ్మవారి ఆలయం ఇప్పుడు సికింద్రాబాద్ కుమ్మరగూడ అమ్మవారి దేవాలయం మీద దాడి జరిగిందన్నారు. అమ్మవారి గుండెల మీద తన్నడమంటే, మన విశ్వాసం మీద, ధర్మం మీద దాడి చేయడం తప్ప మరోటి కాదన్నారు. ఇవే కాదు సంగారెడ్డి జిల్లా ఆంజనేయ స్వామి దేవాలయం, వినాయక విగ్రహం మీద దాడి..ఇవన్నీ ఎందుకు జరుగుతున్నాయో తెలియాల్సిన అవసరం ఉందన్నారు. ఈ మొత్తం ఘటనలపై సీఎం రేవంత్ రెడ్డి విచారణ జరిపించాలని ఈటల డిమాండ్ చేశారు.

### వాడు మనిషా..?

అమ్మ వారి మీద దాడి చేసిన వాడు.. హాస్పిటల్ బెడ్ మీద దర్జాగా పడుకొని చాటింగ్ చేస్తున్నాడని, ఇంకా అవమానకర పోస్టులు పెడుతున్నాడని, అల్లానే ఈ పని చేయించాడు అని చెప్పుకుంటున్నారని ఈటల ఫైర్ అయ్యారు. వాడి దగ్గర సెల్ ఫోన్ ఎలా ఉంది? వాడు మనిషా ? ఉన్మాదా అని నిలదీశారు. ఇక్కడ ఉన్న ప్రభుత్వం పట్టించుకోకపోతే కేంద్రం, మోడీ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని హెచ్చరించారు. ఏ మతం కూడా ఇలాంటి చర్య సమర్థించదని, హిందూ మతం సర్వేజనా సుఖినో భవంతు అని కోరుకుంటుందని స్పష్టం చేశారు. అమెరికా, లండన్ ప్రపంచంలో ఎక్కడ ఉన్నా.. ఇండియన్స్ అంటే గొప్ప మర్యాద ఉంటుందన్నారు. మనవారు ఎక్కడ ఉన్నా భారత సంప్రదాయాలు కొనసాగిస్తున్నారని, ఏ దేశంలో మహిళలు గౌరవించబడతారో ఆ దేశం చల్లగా ఉంటుంది అనడానికి సజీవ సాక్ష్యం భారత దేశం అని పేర్కొన్నారు. ఎవరి విశ్వాసాలకు తగ్గట్టు వారు ఉండాలని సూచించారు.

### ఉన్మాదాన్ని అణచివేయాలి

కొద్ది మంది విద్వేషాలు రెచ్చగొట్టేందుకు సిటీలో మీటింగ్ పెట్టుకుంటే ఇంటిలిజెన్స్ పోలీస్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పోలీస్ అధికారి కృష్ణ ప్రసాద్ బాంబు దాడిలో చనిపోయారని, లుంబిని పార్క్, గోకుల్ చాట్ లో, సాయి బాబా గుడిదగ్గర బాంబులు పేలితే ఎగిరిపడ్డ మాంసం ముద్దలు గుర్తుకు లేవా..? అని ప్రశ్నించారు. ఇలాంటి దుర్మార్గులకు ఆశ్రయం కల్పిస్తే, ప్రోత్సహిస్తే రక్తం మరిగిన పులుల లెక్క అందరి మీద దాడి చేస్తారని చెప్పారు. రేవంత్ మీ దిక్కుమాలిన ఓట్ల రాజకీయం పక్కన పెట్టాలని ఉన్మాదాన్ని ఉపేక్షిస్తే చరిత్ర క్షమించదన్నారు. ప్రజల ప్రాణాలు, విశ్వాసం, ధర్మం కాపాడలేని వారు నాయకులు కాదు అనేది బీజేపీ సిద్ధాంతమన్నారు. ఇలాంటి వారి మీద నిఘా పెట్టి నిలవరించాలని, పాకిస్థాన్ లో ట్రైనింగ్ పొంది ఇక్కడికి వచ్చి ప్రచారం చేస్తున్న వారిపట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

### కఠిన చర్యలు తీసుకోండి..

సీపీ ఆనంద్ కు సిటీ మీద సంపూర్ణ అవగాహన ఉంటుందని, కేవలం విగ్రహ ధ్వంసం కోణంలో చూడకండని, అతని చేతికి సెల్ ఫోన్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇలా చేస్తే ఎలా కంట్రోల్ అవుతుందని, అతని మీద పెట్టిన కేసులు సమీక్షించండని సూచించారు. హోటల్ లో మీటింగ్ ఎవరు పెట్టారు, ఎందుకు పెట్టారు. వారు ఎక్కడి వారు అనే విషయాలు ఆరా తీయాలని కోరారు. కేంద్ర ఐబీ కూడా నిఘా పెట్టిందని చెప్పారు. గుడి మీద కన్నేయాలంటే గజ్జుమనేల చర్యలు తీసుకోవాలని ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు.

## వాయనాడ్‌లో ప్రియాంకపై ఖుష్బూ

### బరిలో దించనున్న బీజేపీ..!



**జనపదం, తిరువనంతపురం :** కేరళలోని వాయనాడ్ లోక్‌సభ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో ప్రియాంక గాంధీ పై నటి ఖుష్బూను పోటీకి దింపాలని బీజేపీ భావిస్తున్నట్లు తెలుస్తోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ.. కేరళలోని వాయనాడ్‌తోపాటు, ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నుంచి కూడా పోటీచేసి రెండు చోట్ల విజయం సాధించారు. దీంతో వాయనాడ్ ఎంపీ పదవికి రాజీనామా చేశారు. ఈ క్రమంలో వాయనాడ్ లోక్‌సభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ వాయనాడ్ నుంచి ప్రియాంకాగాంధీని బరిలో దించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ప్రియాంకాగాంధీపై నటి ఖుష్బూ సుందర్‌ను బరిలో దించాలని భావిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీనిపై ఖుష్బూ సుందర్ స్పందించారు. ఎన్నికల వేళ ఇలాంటి పుకార్లు వస్తూనే ఉంటాయన్నారు. ఇది కూడా పుకారే అని చెప్పారు. అయితే ఒకవేళ పార్టీ ఆదేశిస్తే తాను ప్రియాంకా గాంధీపై పోటీ చేయడానికి సిద్ధమని తెలిపారు. కాగా వాయనాడ్ ఉప ఎన్నికల్లో త్రిముఖ పోటీ జరగనుంది. ఎందుకంటే అక్కడి నుంచి కమ్యూనిస్టు పార్టీ కూడా బలమైన అభ్యర్థిని బరిలో దించింది. తమ అభ్యర్థి సత్యన్ మొకేరీ బరిలో దిగుతారని ఇప్పటికే కమ్యూనిస్టు పార్టీ ప్రకటించింది.

## మూసీ లూటీఫికేషన్




**(మొదటిపేజీ తరువాయి)** ప్రాంతంలో ఎలాంటి సర్వే జరగలేదన్నారు. కాంగ్రెస్ చేసిందంతా జేసీబీలతో ఇళ్లు కూలగొట్టించిందన్నారు. పైగా ఈ ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్నదంతా పచ్చి అబద్ధమన్నారు. ప్రాజెక్ట్ కు సంబంధించి అంచనాను రూ. 50 వేల కోట్ల నుంచి మొదలుకుని లక్షా నర్ర కోట్ల వరకు అన్ని పచ్చి అబద్ధాలేనని కేటీఆర్ మండిపడ్డారు. ఈ ప్రాజెక్టులో జరుగుతున్న లూటీ ప్రజలకు తెలియకుండా రేవంత్ రెడ్డి తన తప్పును కప్పి పుచ్చుకోవటానికి నానా ఇబ్బంది పడిపోతున్నాడన్నారు.

### అప్పుడు బడే బాయ్.. ఇప్పుడు చోటే బాయ్..

నోట్ల రద్దు పై బడేబాయ్ (మోదీ) రోజుకో కారణం చెప్పినట్లు, చోటే భాయ్ (రేవంత్) కూడా మూసీ పై రోజుకో కారణం చెబుతున్నాడని మండిపడ్డారు. అసంబద్ధంగా, ఆనాలోచితంగా తీసుకున్న నోట్ల రద్దు నిర్ణయం కారణంగా ఎంతటి అనర్థాలు జరిగాయో గుర్తు చేస్తున్నాను అన్నారు. సరిగ్గా మూసీ విషయంలోనూ ఇదే విధంగా ఆనాలోచితంగా, అసంబద్ధంగా నిర్ణయాలు తీసుకొంటున్నారన్నారు. గోపనపల్లి లో రూ.లక్షాన్నర కోట్లతో మూసీ సుందరీకరణ అని చెప్పి, మళ్లీ గజిని మాదిరిగా రూ.లక్షన్నర కోట్లు అని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గుచేటన్నారు.

### రోజుకోటి..

ఒక రోజు మూసీ బ్యూటీఫికేషన్, మరో రోజు క్లీనింగ్, ఇంకొక రోజు పునరుజ్జీవనం, నల్గొండకు మంచి నీళ్లు అంటూ రోజుకో మాట మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. పైగా గురువారం మూసీ మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేసి మరోసారి రేవంత్ రెడ్డి తన అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నాడన్నారు. చేయని సర్వేలను చేసినట్లు.. అబద్ధాలు, అసత్యాలు, అర్ధసత్యాలను అర్థరహితం లేని అసంబద్ధ వాదనలను సంపూర్ణంగా బయటపెట్టి తన పరువు తానే తీసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకత వస్తున్న క్రమంలో గ్రాఫిక్స్ మాయాజాలంతో రేవంత్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నాడని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అటకెక్కించారన్నారు. 420 హామీలతో ప్రజల గొంతు కోశారన్నారు. 1908 లో అతి పెద్ద ఉప్పెన, వరద రావటంతో హైదరాబాద్ లో సుమారు 15 వేల మంది చనిపోయారన్నారు. దీంతో అప్పటి నిజాం మీర్ ఉస్మాన్ అలీ హైదరాబాద్ ను వరదల నుంచి రక్షించేందుకు మోక్షగుండం విశ్వేశ్వరయ్య తీసుకుని ఉస్మాన్ సాగర్, హిమా యత్ సాగర్ ను నిర్మించారన్నారు. ఆ తర్వాత మూసీ విషయంలో ఏ ప్రభుత్వం కూడా మళ్లీ అంత గొప్పగా పనిచేయలేదన్నారు. నగరంలో ఉన్న నాలాల ద్వారా 90 శాతానికి పైగా మురికి నీళ్లు, వాన నీళ్లు మూసీలోకే వస్తాయని కేటీఆర్ అన్నా రు. దీంతో 2015 లో సెంట్రల్ పొల్యూషన్ బోర్డు అతి పెద్ద కాలుష్యమైన నది మూసీ అని రిపోర్ట్ ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూసీని బాగు చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేసిందన్నారు. ఇందులో భాగంగానే 2017 లో మూసీ రివర్ ఫ్రంట్ పేరుతో కార్పొరేషన్ ఏర్పాటు చేసి మూసీని బాగు చేయాలని నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ భావించారన్నారు. మూసీని బఫర్ టిబికేషన్ తో పాటు పునరుజ్జీవనం చేస్తూ నల్గొండకు మంచి నీళ్లు ఇవ్వాలని లక్ష్యం గా పెట్టుకున్నామన్నారు. కానీ రేవంత్ రెడ్డి మూసీ పుట్టిన వికారాబాద్ అడవుల్లోనే ఆ నదికి ఉరి వేసేలా దామగుండం రాడార్ నిర్మాణానికి అనుమతిచ్చారని మండిపడ్డారు.

### 16వేల కోట్లతోనే చేట్టాలని నిర్ణయించాం..

మూసీ ప్రాజెక్ట్ ను కేవలం రూ. 16 వేల కోట్లతోనే చేయాలని గత బీఆర్ఎస్ నిర్ణయించిందని కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగా కొన్ని పనులు కూడా చేపట్టామన్నారు. నాగోల్, ఉప్పల్ భగాయత్ ప్రాంతంలో వాకింగ్ ట్రాక్స్ ను, పార్కులను ఏర్పాటు చేశామని వివరించారు. దక్షిణ భారత దేశంలోనే ఎక్కడ లేని విధంగా ఎస్టీపీలతో 100 శాతం మురుగు నీటి శుద్ధి చేసే పని పెట్టుకున్నామన్నారు. 5 కిలోమీటర్ల పాటు నాగోల్ లో మూసీ శుద్ధి కోసం ల్యాండ్ స్కేప్ చేసినప్పటికీ ఒక్క పేదవాడి కడుపు కొట్టలేదన్నారు. ప్రస్తుతం నగరంలో 2 వేల ఎంఎల్‌డీ మురికి నీరు ఉత్పత్తి అవుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చే నాటికి కేవలం 7 వందల ఎంఎల్‌డీ లు మాత్రమే శుద్ధి చేసే కెపాసిటీ మాత్రమే ఉండేదని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. అందుకే ముందుగా ఎస్ టిపిలను నిర్మించాలని భావించి కేసీఆర్ 31 ప్లాంట్లను మంజూరు చేశారన్నారు. ఈ ఎస్ టిపీల పనులు పూర్తి అయితే చాలు నల్గొండకు మంచి నీళ్లు వెళ్తాయి. వాటి కోసం రూ. లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేసి దోపిడీ చేయాల్సిన అవసరం లేదన్నారు.

# కాంగ్రెస్ లో ఇందిరమ్మ కమిటీల చిచ్చు..!

### రెండుగా చీలిన మానుకోట కాంగ్రెస్?



**జనపదం, మహబూబాబాద్:** కొంతకాలంగా లోపాయి కారికంగా ఉన్న మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీలో ఉన్న వర్గ విభేదాలు ఇందిరమ్మ కమిటీల రూపంలో ఒక్కసారిగా బయటపడ్డాయి. ఏకంగా గురువారం మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ ను టార్గెట్ చేస్తూ నెల్లికుదురు మండల కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే పర్యటనకు అడ్డు తగలడంతో పాటు, ప్రెస్ మీట్ నిర్వహించి తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధమని ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ టికెట్ కోసం ప్రస్తుత ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళి నాయక్ తీవ్రస్థాయిలో పోటీపడ్డారు. చివరి క్షణం వరకు టికెట్ ఈ ఇద్దరి నేతల్లో నీకా నాకా అన్న తరహాలో పోటీ సాగింది. చివరకు సర్వేలు, గతంలో ఒకసారి టికెట్ కోసం ఆశించి భంగపడటం లాంటి అంశాలతో పాటు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జన్నా రెడ్డి భరత్ చందర్ రెడ్డి ఆశీస్సులు మురళి నాయక్ కు ఉండడంతో అధిష్టానం చివరి క్షణంలో మురళి నాయక్ కు టికెట్ ఇచ్చింది. అంతకుముందు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడి ప్రమేయం లేకుండానే మానుకోట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండల పార్టీ అధ్యక్షులను ఉన్నఫలంగా తొలగించి బలరాం నాయక్ అనుచరులను నియమించారనే ఆరోపణలు వినిపించాయి. అప్పటినుంచే ఇద్దరు నేతల అనుచరులు ఎవరికి వారుగా తమ నేతలకు టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. టికెట్ దక్కించుకున్న మురళి నాయక్ ఎన్నికల్లో 50 వేల రికార్డు ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తరువాత జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించి బంగపడ్డ బలరాం నాయక్ ఎంపీ టికెట్ సాధించి ఆయన కూడా అఖండ విజయం సాధించారు. అయితే మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లో ఇరు నేతల అనుచరులు పైపైకి కలిసి ఉన్నట్లు కనిపించినా లోలోపల ఎవరికి వారుగానే వ్యవహరిస్తున్నారని ఆరోపణలున్నాయి. ఎవరికి వారు పై 'చేయి' సాధించడానికి గత కొంతకాలంగా ఎత్తుకు పైఎత్తులు వేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవికి ఎమ్మెల్యే మురళి నాయక్ ప్రతిపాదించగా, చివరి క్షణంలో ఎంపీ బలరాం నాయక్ ప్రతిపాదించిన గంట సంజీవరెడ్డికి ఇప్పించడంతో ఎమ్మెల్యే పై ఎంపీ వర్గం పై చేయి సాధించినట్లు చెప్పుకుంటున్నారు. ఇటీవల ఎమ్మెల్యే మురళి నాయక్ జన్మదిన వేడుకల సందర్భంగా కేసముద్రం మండల కేంద్రంలో అటు ఎమ్మెల్యే అనుచరుడిగా పేరున్న డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్ రెడ్డి, బలరాం నాయక్ అనుచరుడిగా గుర్తింపు ఉన్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు వేర్వేరుగా వేడుకలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే అంబటి మహేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పాల్గొని అల్లం నాగేశ్వరరావు ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొనకుండానే వేదిక పక్క నుంచి గూడూరుకు వెళ్లడంతో అల్లం అనుచరులు ఎమ్మెల్యే పై గుస్సా వ్యక్తం చేశారు. ఇలా కొంతకాలంగా మహబూబాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కాంగ్రెస్ పార్టీలో చాప కింద నీరులా ఉన్న వర్గ విభేదాలు బహిర్గతం కావడంతో పాటు గురువారం నెల్లికుదురు కాంగ్రెస్ నేతలు పార్టీ కోసం కట్టించే వారికి కమిటీలో చోటు కనిపించకుండా, ఎమ్మెల్యే అనుచరులకి పెద్దపీట వేశారని ఏకంగా ఎమ్మెల్యేను టార్గెట్ చేసి విమర్శలకు దిగడం, శుక్రవారం ఎమ్మెల్యే వర్గీయులు పోటీ ప్రెస్ మీట్ పెట్టి విమర్శలకు దిగడంతో కాంగ్రెస్ పార్టీ మానుకోట నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల కమిటీ మాటున వర్గ పోరు మరింత రాజుకున్నట్టయ్యింది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో స్టేషన్ ఘనపూర్, శాయంపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో మాదిరిగా మహబూబాబాద్ నియోజకవర్గంలో గ్రూపు విభేదాలు పొడసూపడం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

### హన్మకొండలో వ్యభిచార ముఠా

**జనపదం, క్రైం:** హన్మకొండ సుబేదారిలో ఓ మహిళ ఇల్లు కిరాయికి తీసుకొని ఇతర రాష్ట్రాల నుంచి మహిళలను రప్పించ్చి ఏడాదిగా వ్యభిచారం చేయిస్తోంది. ఈక్రమంలోనే శుక్రవారం రంగశాయిపేటకు చెందిన ఇద్దరు.. మహిళలతో ఒప్పందం కుదర్చగా, వారు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు దాడిచేశారు. విటులతో పాటు నిర్వాహకురాలిని అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

## ఎల్ఈడీ బల్బ్‌లో డ్రగ్స్..

### బెంగళూరు వయా గుంటూరు టు హైదరాబాద్

**జనపదం, గుంటూరు:** బెంగళూరు నుంచి గుంటూరు, హైదరాబాద్‌కు డ్రగ్స్ రవాణా చేస్తున్న నిందితులను శుక్రవారం గుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. 65 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను సీజ్ చేశారు. ఎల్ఈడీ బల్బ్‌లో డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నట్లు గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. బల్బ్‌లో డ్రగ్స్‌ను రవాణా చేస్తున్నట్లుగా వచ్చిన సమాచారంతో తనిఖీలు చేపట్టి డ్రగ్స్‌ను సీజ్ చేశామని వివరించారు. డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న యూసఫ్, డోనాల్డ్ (టోనీ)లను అదుపులోకి తీసుకున్నామని ఎస్పీ అన్నారు. 65 గ్రాముల డ్రగ్స్ విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని ఎస్పీ తెలిపారు. వీరికి అవసరమైనంత డ్రగ్స్‌ను ఉంచుకుని మిగిలినది హైదరాబాద్‌లోని స్నేహితులకు పంపేందుకు ప్రయత్నిస్తున్నట్లు వివరించారు. ఇప్పటి వరకు 3 సార్లు డ్రగ్స్‌ను తరలించారని ఆ వివరాలను రాబట్టామని తెలిపారు. హైదరాబాద్‌లో ఎవరికి పంపుతున్నారనే వివరాలతో పాటుగా బెంగళూరులో వీరికి సరఫరా చేస్తున్న వారిని పట్టుకునేందుకు కూడా ప్రత్యేక బృందాలను పంపామని అన్నారు.



## ప్రక్షాళన పేరుతో విధ్వంసం..

- 23, 24 తేదీల్లో మూసీ ప్రాంతాల్లో పర్యటన
- 25వ తేదీన నిరసన కార్యక్రమాలు
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**జనపదం, బ్యూరో:** తెలంగాణలో బీజేపీ బలోపేతం దిశగా అడుగులు వేస్తున్నామని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ బన్సల్, కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి అధ్యక్షతన బీజేపీ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, శాసనమండలి సభ్యుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. అనంతరం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సమావేశానికి సంబంధించిన అంశాల గురించి మీడియాతో మాట్లాడారు. పార్టీ సభ్యత్వ నమోదు, ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలు, తదితర విషయలపై చర్చించామన్నారు. తెలంగాణలో బీజేపీని మరింత బలోపేతం చేసేలా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించినట్లు చెప్పారు. రాష్ట్రంలో వివిధ అంశాలపై బీజేపీ చేపట్టే కార్యక్రమాలపై నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో బీజేపీ మెంబర్ షిప్ డ్రైవ్ ను మరింత ఉత్సాహంగా, పెద్దఎత్తున కొనసాగేలా ఎజెండా రూపొందించారని చెప్పారు. రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికల విషయంలో బీజేపీ వ్యూహాత్మకంగా ముందుకెళ్లేలా చర్చించామని అన్నారు. క్షేత్రస్థాయిలో విస్తృతంగా కార్యాచరణను తీసుకెళ్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు త్వరలోనే అభ్యర్థిని పార్టీ నిర్ణయిస్తుందని అన్నారు. తెలంగాణలో హైడ్రా విషయంలో, మూసీ ప్రక్షాళన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న విధ్వంసాన్ని వ్యతిరేకిస్తూ అక్టోబర్ 23, 24 తేదీల్లో వివిధ ప్రాం తాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు పర్యటించి పరిశీలన చేసి 25 వ తేదీన బీజేపీ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు చేపడుతామని అన్నారు.

# నేనొస్తా.. నువ్వొ రా..




**(మొదటిపేజీ తరువాయి)** హరీష్ రావు అన్నారు. శుక్రవారం ఆయన తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిన్న ముఖ్యమంత్రి మూసీ సుందరీకరణపై చెప్పిన పలు విషయాలపై పూర్తి వివరాలను మీడియా ముందుంచారు.

### అరచేతిలో స్వర్గం చూపారు..

మూసీ నది పునరుజ్జీవనమే తప్ప సుందరీకరణ కాదని ముఖ్యమంత్రి చెప్పిందని, విదేశీ కంపెనీ ఇచ్చిన వీడియో చూస్తే మాత్రం అసలు మామూలు గ్రాఫిక్స్ కనిపించలేదున్నారు. అసలు మూసీ నదిని చూస్తున్నామా.., లేదంటే మరే అద్భుతమైన లోకానికి తీసుకెళ్లారా.. అన్నట్టుగా అనిపించిందన్నారు. వారు చూపించిన వీడియోలో న్యూయార్ టైం స్క్వేర్ ను మించిన వెలుగు జిలుగులు కనిపించాయన్నారు. సిడ్నీ ఒపెరా హౌజ్ ను తలదన్నే హైరెంజ్ బిల్డింగులు, లండన్ లోని థేమ్స్ నది మీదున్న బ్రిడ్జిని మించిన బ్రిడ్జిలు చూపెట్టిన తీరు చాలా అద్భుతం అన్నారు. అదంతా చూస్తుంటే ఒకానొక దశలో కళ్లు బైర్లు కమ్మి రెప్పలు మూసుకుపోయాయని ఎద్దేవా చేశారు. ఎందుకంటే ప్రపంచ దేశాల్లో ఉన్న రివర్ ఫ్రంటులన్నీ ఒక్క దగ్గర వేసి దంచి నూరి ఏఐలో వేసి తీసినట్టున్న పంచవన్నెల దృశ్యాలకు ఆ వీడియో చక్కడి వేదికైందన్నారు. టెక్నాలజీని పట్టుకుని అద్భుతమైన ఎడిటింగ్ లతో, మైమరపించే గ్రాఫిక్స్ లుక్కులతో చేసిన తీరు చాలా బాగుందన్నారు. నది పునరుజ్జీవనం అంటే సజీవంగా గలగలపారే స్వచ్ఛమైన జలాలు, సుందరీకరణ అంటే వాళ్లు చూపించిన హైటెక్కులు, అద్దాల ఏఐ బిల్డింగులే కావచ్చేమో అని వ్యంగ్యంగా మాట్లాడారు. అద్దాల బిల్డింగులు ఉండవన్నా వారు మళ్లీ అన్నేసి అందాలను ఎందుకు చూపించారో సెలవియ్యాలన్నారు. మరి ఇదంతా చూసిన తర్వాత ముఖ్యమంత్రి మాటలు నిజమనుకోవాలా..? కాంట్రాక్టు తీసుకున్న కంపెనీల కన్సార్షియం చూపించింది కరెక్టు అనాలా... వారే తేల్చాలన్నారు. అదీకాకుండా వాళ్ల వీడియో ప్రజెంటేషన్ లో రివర్ రెజునెవేషన్ అండ్ రివర్ ఫ్రంట్ అని ఉందని, రివర్ రెజునెవేషన్ అంటే నదీ పునరుజ్జీవనం అనే విషయం తెలుసని, మరి ఈ ఫ్రంట్ స్టంట్ ఎక్కడ నుంచి వచ్చిందని హరీష్ రావు సీఎం రేవంత్ ను నిలదీశారు.

### కూల్చే పైశాచికం...

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్మాణాలంటే ద్వేషం పెంచుకున్నట్టుగా అనిపిస్తోందని, ఆయనకు నిద్రలో కూడా డిస్ట్రక్షన్ సౌండ్ వింటే ఎంతో హాయిగా కునుకు పట్టేలా మైండ్ సెట్ మార్చుకున్నాడని దుయ్యబట్టారు. ఎన్నో ఏళ్లుగా పడిన శ్రమ, ఎందరిదో జీవిత కాలపు కల, అలాంటి వాటిని నిర్దాక్షిణ్యంగా నేలమట్టం చేసే పైశాచిక క్రీడకు తెరతీసిన సీఎం తీరు ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారన్నారు. పైసాపైసా కూడేసిన వారిని కనీసం ఖాళీ చేసే అవకాశం కూడా కల్పించకుండా, పైత్యం ముదిరిన వాడిగా యంత్రాంగాన్ని ఉసిగొల్పి యంత్రాలతో ఆటుకుంటున్నాడన్నారు. నిజంగా ప్రజల బాగోగులకే పట్టిన వ్యక్తి అయితే వారిని ముందుగా అప్రమత్తం చేయాలని, వారి అవసరాలు, కుటుంబ పరిస్థితులు, నేపథ్యాన్ని కూడా తీక్షణగా తెలుసుకోవాలన్నారు. అంతే గానీ పిచ్చిపట్టిన వాడిగా, లేడికి లేచిందే పరుగు అన్నట్టుగా బుల్డోజర్లు తేవడం, విధ్వంసం సృష్టించడం అన్నట్టుగా సాగుతున్న పాలన తీరు దేశమంతా తీవ్ర చర్చనీయాంశం అయిందన్నారు. ఏ రాష్ట్ర సర్కార్ కూడా ఇంతటి మొండి పట్టుదలకు పోలేదని, ఏదో చేయాలనే ఆలోచనను మనస్సులో పెట్టుకుని, మరేదో చేసి తనను తాను కప్పిపుచ్చుకునే తీరును ప్రజలు అంత తొందరగా మర్చిపోరని హరీష్ రావు హెచ్చరించారు. కన్ స్ట్రక్షన్ దగ్గర మొదలు లేకుండా, డిస్ట్రక్షన్ దగ్గర షురూ చేసిన సీఎం రేవంత్ యాక్టివిటీని అంతా గమనిస్తూనే ఉన్నారన్నారు.

### దమ్ముంటే రా..

మాటలు మాట్లాడినంత తేలిక చేతలు ఉండవని, ఆ విషయం సీఎం రేవంత్ గుర్తుంచుకుంటే మంచిదని హరీష్ రావు హితువు పలికారు. ఆయన ఎక్కడికైనా సెక్యూరిటీ లేకుండా వస్తానన్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యమంత్రికి నిజంగా దమ్ముంటే ఎలాంటి సెక్యూరిటీ లేకుండా రావాలని, ఇప్పుడు నేను చెబుతున్నారమ్మన్న కాడికి వచ్చే ధైర్యం ఉందా చెప్పాలన్నారు. ఆయన వస్తానంటే ఆహ్వానిస్తానన్నారు. టైం, డేట్ ఆయనే చెప్పొచ్చని, కేవలం ఆయన నేను ఇద్దరమే కారు తోలుకుంటూ వెళ్దామని, అందుకు తాను సిద్ధమని, రేవంత్ ఎప్పుడు ప్రకటిస్తాడో చూస్తానన్నారు. మాటమీద నిలబడే వ్యక్తిత్వం అని డంకాయించుకునే రేవంత్ నిజంగా సెక్యూరిటీ లేకుండా వస్తానన్న ప్రకటనకు కట్టుబడి ఇప్పుడు రావాలన్నారు. ఆయనకు సమ్మతమే అయితే రేపు ఉదయం 9 గంటలకు నేను రెడీ అయి ఎదురు చూస్తానన్నారు. ముందుగా ఆయన నేను కలిసి మూసీ నిర్వాసితులకు వద్దకు వెళ్తామని, ఆ తర్వాత ఆర్ అండ్ ఆర్ కాలనీకి అట్నుంచి అటే మల్లన్న సాగర్, దాని తర్వాత రంగనాయక్ సాగర్ కట్ట మీదుగా ప్రయాణం చేసి అక్కడే కాసేపు కూర్చుని మాట్లాడుకుందామని తన సవాల్ ను సీఎం స్వీకరిస్తాడనే అనుకుంటున్నానన్నారు. నిజంగా రేవంత్ రెడ్డికి గొప్ప మనస్సే ఉంటే గతంలో బీఆర్ఎస్ సర్కార్ మల్లన్న సాగర్ నిర్వాసితులకు ఇచ్చిన ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వెంటనే ఇవ్వాలన్నారు. దేనికైనా బీఆర్ఎస్ సర్కార్ పై ఏడ్వడం తప్ప చేసేది శూన్యమన్నారు. 2013 చట్టానికి మించిన ప్రయోజనాలు మల్లన్న సాగర్ ప్రజలకు బీఆర్ఎస్ ఇచ్చిన విషయాన్ని కూడా అబద్ధపుదిగా ప్రచారం చేయడానికి చెంచాలను ఉపయోగించుకుంటున్న సీఎం తీరు చూస్తుంటే సిగ్గు మొత్తం వదిలేసినట్టుగా అనిపిస్తోందన్నారు. నిజంగా సిగ్గు ఉన్నవారు, విలువలకు విలువిచ్చే వారు ఇలాంటి చౌకబారు ముచ్చట్లకు దిగరన్నారు.

### చరిత్ర తెలుసుకో..

సీఎం రేవంత్ రెడ్డి గతంలో చేసిన పార్టీల దిగజారుడు పనులను మర్చిపోతే ఎలా అని హరీష్ రావు ప్రశ్నించారు. గతంలో ఆశాలు, అంగన్ వాడీలను గుర్రాలతో తొక్కించిన చరిత్ర ప్రస్తుతం ఆయన(ముఖ్యమంత్రి) పదవి వెలగబెడుతున్న కాంగ్రెస్ పార్టీది అని మర్చిపోవద్దన్నారు. ఆయన తెలుగు దేశంలో ఉన్నప్పుడు కూడా విద్యుత్ చార్జీల నిరసనకారులు, ఆశాలు, అంగన్ వాడీలు, ఇతర శ్రామిక వర్గాల ఆందోళనలపై ఎలా ఉక్కుపాదం మోపిందో గుర్తు తెచ్చుకోవాలన్నారు. ఆ పార్టీల మూలాలు ఇంకా స్పష్టంగా కొనసాగిస్తున్న వారసుడిగా రేవంత్ రెడ్డికి తప్పకు గుర్తింపు ఉంటుందని ఎద్దేవా చేశారు. పదవులు, హోదాలు శాశ్వతం కాదని, గతాన్నిమర్చిపోయి, వర్తమానంలో ఎదిరెగిరిపడితే భవిష్యత్ ఎంత అందవిహీనంగా, అంధకారంగా ఉంటుందో గుంపులో ఉన్నప్పుడు కాకపోయినా, ఒంటరిగా ఉన్నప్పుడైనా గుర్తు చేసుకోవాలని హరీష్ రావు హితువు పలికారు. ఏ పార్టీలో కొనసాగినా తనకంటూ ఓ ప్రత్యేకత, పేదలకు సేవ చేసిన గురుతులను కాపాడుకుంటే ఎన్ని తరాలకైనా ఆదర్శంగా ఉంటామనే కనీస విచక్షణను కూడా మరిచిపోయి రేవంత్ రెడ్డి మూసీ సుందరీకరణ, హైడ్రా వండరీకరణ అంటూ ఏదేదో కథలు పడుతున్నాడన్నారు.

### ఆక్రమణలకు కేరాఫ్ రేవంతే..

నిజానికి హైడ్రా హంగామా.., కమిషనర్ దూకుడు., సర్కార్ సహకారం.., ఇవన్నీ పేదల అంతుచూడడానికే తప్ప మరేమీ కాదని హరీష్ రావు అన్నారు. మూసీ వెంట మొత్తంగా ఆక్రమణలు జరిగాయని, వాటిని క్లియర్ చేస్తే భవిష్యత్ బ్రహ్మాండంగా ఉంటుందనే ఉద్ధరించే పనికి శ్రీకారం చుట్టామని చెప్పుకుంటున్న సీఎం తన నిజరూపాన్ని కూడా బయటపెట్టుకోవాలన్నారు. ఆ మాటకొస్తే వాస్తవానికి ఆక్రమణలు చేస్తున్నది పేద ప్రజలు అస్సలే కాదని, ముమ్మాటికి అక్రమంగా పేదల భూములు ఆక్రమించుకుంటున్నది రేవంత్ అండ్ టీం అనే విషయం మర్చిపోవద్దన్నారు.

### ప్రజల వెంటే ఉంటాం..

కాంగ్రెస్ సర్కార్ ఎంత వెకిలిచేష్టాలకు పోయినా, రేవంత్ ఎంత ఒంటెత్తు పోకడలతో పేదలను ఇబ్బందులకు గురిచేయాలని చూసినా బీఆఛ్ఎస్ పార్టీ తప్పకుండా పేదల పక్షాన నిలుస్తుందని హరీష్ రావు ప్రకటించారు. రాజకీయాల్లో పదవులు, ప్రభుత్వాలు శాశ్వతం కాదని, పేదోడికి అండగా ఉంటే వారి బతుకులు మార్చేందుకు అవకాశం చిక్కితే దానిని సద్వినియోగం చేసుకోవడం ముఖ్యమన్నారు. బీఆర్ఎస్ సర్కార్ చేసిన పనులపై కోపముంటే వారితో తేల్చుకోవాలనిగానీ, అనవసరంగా ప్రజల జీవితాలతో ఆడుకోవడం సరికాదన్నారు. కేసీఆర్ సర్కార్ తీసుకొచ్చిన పనులు నచ్చకపోతే ప్రజలకు కలిగే ప్రయోజనాల కోసమైనా కొనసాగించేలా చూడాలిగానీ, వ్యక్తిగత టార్గెట్ కోసం కుప్పకూల్చొద్దన్నారు. బీఆఛ్ఎస్ తీసుకొచ్చిన ఫోర్త్ సిటీని ఎక్కడ పెట్టాలనుకుంటున్నారో రేవంత్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేవలం తను, తనవారి కోసం రియల్ ఎస్టేట్ చేయడానికి నిర్ణయించుకుని ఇన్న డొంకతిరుగుడు వేషాలతో ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న రేవంత్ తీరు గర్హనీయం అన్నారు. ముచ్చట్లు చెప్పడం మహా గొప్పగా ఉంటున్నాయని, వెనకాల మాత్రం వాటి ప్రయోజనాలు మరోలా జరుగుతున్నాయని దుయ్యబట్టారు. కల్లబొల్లి ముచ్చట్లు మానుకోవాలన్నారు.

### ప్రేముంటే కష్టాలు తీర్చు..

బీఆర్ఎస్ పార్టీ బలాన్ని నిలువరించలేక నల్లగొండ లో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్న సీఎం తీరును ఎలా అర్థం చేసుకోవాలో తెలియడం లేదని హరీస్ రావు అన్నారు. పార్టీలతో రాజకీయం చేయాలిగానీ, ప్రజలతో చేయొద్దన్నారు. ఎవరి బతుకులు వారు వెల్లదీస్తున్న వేళ కేవలం పాత రోజులను మనస్సులో పెట్టుకుని కక్ష సాధించడానికి ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నాడన్నారు. నిజానికి రేవంత్ కు చిత్తశుద్ధి ఉంటే నల్లగొండ ప్రజలపై అమితమైన ప్రేమే ఉంటే వారి బతుకులు దుర్లభం కాకుండా చూడాలని కోరారు. పారిశ్రామిక వ్యర్థాలు చెరువుల ద్వారా మూసీలో చేరకుండా తీసుకుని వారికి పునర్జన్మ ఇవ్వాలన్నారు. బీఆర్ఎస్ గానీ, నాయకులుగానీ మూసీ పునరుజ్జీవానికి వ్యతిరేకం కాదని హరీష్ రావు ప్రకటించారు. కేవలం కాంగ్రెస్ సర్కార్ మొండి వైఖరికి, రేవంత్ రెడ్డి తలబిరుసు పనులను మాత్రమే వ్యతిరేస్తున్నామన్నారు. మరీ ముఖ్యంగా సీఎం బుల్డోజర్ విధానాలు, ప్రజా సేవ పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి చేసుకుంటున్న ఏర్పాట్లను మాత్రమే ఎండగడుతున్నామని హరీస్ రావు వివరించారు. ఉన్నది ఉన్నట్టుగా మాట్లాడితే దాడులకు ఉసిగొల్పుతున్న ఆయన తీరును ఎప్పటికీ ఎండగడుతూనే ఉంటామన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురి చేసినా, ఎంతగా తొక్కాలని చూసినా బాధితుల పక్షాన పోరాడడంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదని హరీస్ రావు ప్రకటించారు. ప్రజలను వీడం.., ప్రజా వ్యతిరేక పాలనను సహించం.., నిరంతరం ప్రజా క్షేత్రమే తమ కేరాఫ్ అని, సామాన్యుడి సాఫీ అయిన జీవితమే తమకు ఆత్మ సంతృప్తి అని మాజీ మంత్రి హరీశ్ రావు వివరించారు.



# మూ'సీ' పే సవాల్

- ప్రక్షాళనపై సీఎం ఆలౌట్ గేమ్
- ఒక్కసారిగా మారిన సవాళ్లు
- రేవంత్ ట్రాప్‌లో విపక్షాలు
- ఎటూ తేల్చుకోని స్థితిలో బీఆర్ఎస్, బీజేపీ
- సీఎంకు బలాన్నిచ్చిన చెన్నై, బెంగళూరు వరదలు
- అక్కడి పరిస్థితులను చూపిస్తూ మూసీ ప్రక్షాళనపై సవాల్
- రాజధానిని కాపాడుకోవాలంటూ ప్రభుత్వం కొత్త పాచిక

**జనపదం, బ్యూరో** : మూసీ ప్రాజెక్టు అంశం సరికొత్త రాజకీయాలకు కేరాఫ్‌గా మారుతున్నది. మూసి ప్రక్షాళనపై సీఎం రేవంత్ పొలిటికల్ గేమ్ మళ్లీ మొదలుపెట్టారు. మూసీ బ్యూటిఫికేషన్‌పై చర్చకు రావాలని బీజేపీ, బీఆర్ఎస్‌లకు సవాల్ విసరారు. ఈ సవాల్ ఇప్పుడు పార్టీలను ఇరకాటంలో పడేసినట్లుగా మారింది. ఇదే సమయంలో బెంగళూరు, చెన్నై వరదలు సీఎం రేవంత్ సవాల్‌కు మరింత బలాన్ని చేకూర్చినట్లుగా మారింది. అక్కడి పరిస్థితులను చూపిస్తూ.. మూసీ ప్రక్షాళనను బలంగా ఎత్తుకుంటున్నారు.

**ట్రాప్ వర్కౌట్..**

సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా మూసీ ప్రక్షాళన ప్రాజెక్టు విషయంలో బీజేపీ, బీఆర్ఎస్ చేస్తున్న విమర్శలకు ఆయన ఒక్క ప్రెస్ మీట్ ద్వారా చెక్ పెట్టారు. అసెంబ్లీలో చర్చకు సవాల్ విసరడం ద్వారా ఆ రెండు పార్టీలకు తేల్చుకోలేని సమస్యను తెచ్చి పెట్టారు. ఎందుకంటే.. ఇప్పుడు మూసి ప్రక్షాళనను ప్రధానమైన రెండు పార్టీలు వ్యతిరేకించే పరిస్థితుల్లో లేవు. ఒకవేళ వ్యతిరేకిస్తే గతంలో మూసీపై బీఆర్ఎస్ చేసిన ప్రకటన మళ్లీ తెరపైకి తీసుకువస్తారు. ఒకవేళ ఇదే విషయాన్ని స్వాగతిస్తే రేవంత్ ట్రాప్‌లో పడినట్లు అవుతుంది. ఇప్పటికే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ట్రాప్‌లో చిక్కినట్లేనని ఓ వర్గం ప్రచారం చేస్తూనే ఉన్నది. మూసీ ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కొంత వివాదమే అవుతున్నాయి. నిజానికి మూసీ ప్రక్షాళనను సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌గా తీసుకున్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మూసిని ప్రక్షాళన చేస్తామని ప్రకటించారు. ఈ విషయంలో ఓ విజన్ ఉందంటూ ప్రతిసారి చెప్పుకుంటూ వస్తున్నారు. నగరం మధ్య నుంచి పోయే మూసీ నదిని అత్యంత సుందరంగా మారిస్తే అది ఆర్థిక వాహకం కూడా అవుతుందని భావిస్తున్నారు. లండన్ లోని థేమ్స్ నదిని కూడా చూసి వచ్చారు. నగరాల నుంచి నదులు ప్రవహించే చోట్ల ఉన్న పరిస్థితుల కంటే హైదరాబాద్ బెటర్ పొజిషన్ లో ఉందని ఆయన నిర్ణయించుకున్నారు. అందుకే కొన్ని అధికార బృందాలకు ప్రత్యేకంగా మూసి మీద సర్వే చేసే పనులు అప్పగించారు. డీపీఆర్ రెడీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. విపక్షం రాజకీయం చేయాలని చూస్తున్నా రేవంత్ దాన్ని రాజకీయంగానే ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యారు.

**వ్యతిరేకత ప్లాన్ వేసిన విపక్షాలు**

మూసి ప్రక్షాళన అనేది అధికారంలోకి వచ్చే ప్రతి పార్టీకి ఓ డ్రీమ్. వైఎస్ రాజశేఖర్ రెడ్డి అనుకన్నారు.. కేసీఆర్ అనుకున్నారు.. కానీ ఎవరూ చేయలేకపోయారు. ఎందుకంటే మూసిలో దశాబ్దాలుగా ఆక్రమణలు ఉన్నాయి. ఏకంగా కాలనీలకు కాలనీలే నిర్మాణం అయ్యాయి. వాటికి ప్రభుత్వాలే పర్మిషన్లు ఇచ్చాయి. కరెంట్, వాటర్ కనెక్షన్లు ఇచ్చాయి. ఇలాంటి ఆక్రమణల కారణంగా మూసీ కాస్తా మురికి కాలువ అయిపోయింది. వారం దర్నీ ఖాళీ చేయించాలంటే ప్రజా వ్యతిరేకత వస్తుందని , పరిహారానికి వేల కోట్లు కేటాయించాలని ఆపేశారు. ఈ విషయాన్ని మూసీ సి ప్రక్షాళన కార్పొరేషన్ చైర్మన్‌గా పని చేసిన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కూడా చెప్పారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి మూసీ ప్రక్షాళనను సీరియస్ గా తీసుకోవడంతో ఆయనపై ప్రజా వ్యతిరేకత పెంచేందుకు మంచి అవకాశంగా చేతికి చిక్కినట్లుగా విపక్షాలు ఆశ పడ్డాయి. ఇదే సమయంలో హైడ్రా కూల్చివేతలు వారికి కలసి వచ్చాయి. అంతే ఒక్క ఇంటినీ కూలగొట్టనీయమని పేదలకు అండగా ఉంటామని హరీష్ రావు, కేటీఆర్, బీజేపీ నేత ఈటల రాజేందర్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఇలా పలువురు నేతలు మూసీ నిర్వాసిత కాలనీల్లో పర్యటించి భరోసా ఇచ్చారు. కావాల్సినంత రాజకీయం చేశారు.

**రేవంత్ కొత్త పాచిక**

మూసీ ప్రక్షాళనపై ఇప్పటిదాకా విపక్షాల లొల్లిని గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డి ఒకేసారి కొత్త పాచిక వేశారు. మూసీ మురికి కూపంగా ఉండటం వల్ల ఎన్ని సమస్యలు వస్తున్నాయో వివరించడమే కాకుండా,.. ప్రజలు వద్దంటే ఆపేస్తానని అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. కేసీఆర్, కేటీఆర్, బీజేపీ ఎమ్మెల్యేలు అందరూ రావాలని సభను ఎన్ని రోజులు కావాలంటే అన్ని రోజులు పెడదామన్నారు. తాను సవాల్ చేయలేదని.. సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. అంతేకాదు, విమర్శిస్తున్న నేతలంతా మూడు నెలలు అక్కడే నివాసం ఉండాలంటూ ఇంకో సవాల్ చేశారు. దీంతో రేవంత్ సవాల్‌కు బీఆర్ఎస్, బీజేపీ ఎలా రియాక్ట్ కావాలనే సందిగ్ధంలో పడ్డాయి.

**చెన్నై, బెంగళూరు వరదలు..**
**మూసి ప్రక్షాళనకు నైతిక బలం**

హైదరాబాద్‌లో గత రెండు నెలలుగా కూల్చివేతలు, మూసి ప్రక్షాళన అంశం హాట్ టాపిక్స్ గా మారిన నేపథ్యంలో.. ప్రభుత్వానికి కొన్ని కొత్త బలాన్ని ఇస్తున్నాయి. చెరువులను కబ్జా చేసి నిర్మించిన ఇళ్లు, ప్రభుత్వ భూముల్లో నిర్మించిన భవనాలు, మూసిని ఆక్రమించేసి కట్టిన కాలనీలను ప్రభుత్వం ఖాళీ చేయిస్తోంది. దీనిపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తూ తాము కూల్చివేతల్ని అడ్డుకుంటామని ప్రకటిస్తూ వస్తున్నాయి . ఇటు సీఎం రేవంత్ రెడ్డి మాత్రం మూసీ ప్రకాళన, చెరువుల కబ్జాల విషయంలో వెనక్కి తగ్గేది లేదని గట్టిగానే చెబుతున్నారు. న్యాయపరమైన సమస్యల కారణంగా హైడ్రా కూల్చివేతలు ఆగాయి. ఈ సమయంలో చెన్నై , బెంగళూరు నగరాలను భారీ వర్షాలు ముంచెత్తాయి. ఈ రెండు నగరాలు రోజంతా నీళ్లలో మునిగితేలుతున్నాయి. వాహనాలు ఎక్కడ మునిగిపోతాయోనని చెన్నై వాసులు తమ కార్లను ఫ్లైఓవర్ల మీద పార్క్ చేసుకుంటున్న దృశ్యాలు వైరల్ అవుతున్నాయి. నిజానికి చెన్నైకి ఈ సమస్య గతంలోనూ వచ్చింది. అందుకే ముందు జాగ్రత్తగా వారు ఈ పని చేసుకున్నారు. ఇక బెంగళూరు లోనూ అదే పరిస్థితి కనిపించింది. వర్షం దెబ్బకు నీళ్లు నిలబడిపోవడంతో ఎవరూ బయటకు రావొద్దని ప్రభుత్వం విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది. నిజానికి వర్షాలు వస్తే ముంపు సమస్య ఉండేది చెన్నై, బెంగళూరుకు మాత్రమే కాదు. హైదరాబాద్‌కూ ఎక్కువే. నాలుగేళ్ల కిందట హైదరాబాద్‌లో రెండు గంటల పాటు కురిసిన వర్షానికి సగం హైదరాబాద్‌లో విధ్వంసం కనిపించింది. వందేళ్లలో వచ్చిన వరద అని ప్రభుత్వం సరి పెట్టుకుంది. కానీ మళ్లీ వందేళ్ల దాకా రాదన్న గ్యారంటీ లేదు. ఇప్పుడు పడుతున్న వర్షాల కారణంగా గట్టిగా గంటసేద జడి వాన కురిస్తే జన జీవనం స్తంభించిపోతుంది. కాలనీల్లోకి నీళ్లు వస్తాయి. అంతంతమాత్రంగా ఉన్న చెరువులు పొంగుతాయి. దీనికి కారణం నాలాలు సహా మూసి నది కూడా ఆక్రమణకు గురి కావడంతో చెరువుల్లో కొన్ని అడ్రస్ లేకుండా పోవడం కూడా ఈ పరిస్థితికి కారణం.

**అదే సర్కారు నినాదం**

కబ్జాలు చేసిన వారిని శిక్షిస్తే ఇళ్లు తొలగిస్తే ప్రజా వ్యతిరేకత వస్తుందన్న కారణంగా వెనకడుగు వేస్తే హైదరాబాద్ భవిష్యత్‌కు పెను ప్రమాదమని కాంగ్రెస్ వర్గాలు గట్టిగానే ప్రచారం చేస్తున్నాయి. ముఖ్యంగా రేవంత్ రెడ్డి ఈ విషయంలో చాలా స్పష్టత ఇచ్చారు. అక్రమార్కుల్ని, కబ్జాదారుల్ని ఇబ్బంది పెడితే సామాన్య జనం వ్యతిరేకంగా మారబోరని.. హైదరాబాద్ ను కష్టాల నుంచి గట్టెక్కిస్తే అందరూ తనకు మద్దతుగా ఉంటారని చెప్తున్నారు. మూసీని ప్రక్షాళన చేయకపోతే మొదటికే మోసం వస్తుందని ఆయన ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడు చెన్నై, బెంగళూరు లో వచ్చిన విపత్తులను హైదరాబాద్‌లో చూపిస్తూ.. మూసీ ప్రక్షాళనపై సర్కారు పాచిక వేసింది. చిన్న వర్షం వస్తేనే మునిగిపోయే పరిస్థితికి వెళ్లిపోతున్న హైదరాబాద్‌కు రేపు ఏదైనా క్లౌడ్ బరస్ట్ బారిన పడితే ప్రజల్లో ఆగ్రహం వస్తుందని, అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే మూసీని ప్రక్షాళన చేయాలని రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్తున్నారు.

**ఇప్పుడేం చేద్దాం..**

మూసీ ప్రక్షాళనపై ఇప్పుడు రెండు ప్రధాన పార్టీలు ఇరకాటంలో పడినట్లుగా మారింది. దీనిపై ఎలా స్పష్టత ఇవ్వాలనేది బీజేపీ, బీఆర్ఎస్‌తేల్చుకోలేకపోతున్నాయి. చిన్న వర్షాలకే ఆగమయ్యే హైదరాబాద్‌కు మూసీ ప్రక్షాళన తప్పదనే సంకేతాలు ప్రభుత్వం ఇచ్చింది. దీనిపై సవాళ్లు చేసింది. ఈ నేపథ్యంలో దాన్ని వ్యతిరేకిస్తే ఏం జరుగుతుందో విపక్ష నేతలకు స్పష్టంగా తెలుసు. ఆదే విషయాన్ని రేవంత్ గట్టిగా పట్టుకున్నారు. ఇప్పుడు మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తే ప్రజలకు వ్యతిరేకం అవుతారు. స్వాగతిస్తే..రేవంత్ చెప్పిందే నిజమని అంగీకరించినట్లవుతుంది. అది కూడా రాజకీయంగా నష్టమే చేస్తుంది. దీంతో మూసీ వ్యవహారంలో ఆచితూచి అడుగేయాలని అంచనా వేస్తున్నారు.



## తట్టుకోలేక పోతున్నరు..

- మూసీ ప్రక్షాళనతో కాంగ్రెస్‌కు పేరొస్తదని బీఆర్ ఎస్‌కు భయం
- మూసీ రివర్ బెడ్ లో ఉన్న వారిని మెప్పించి పునరావాసం కల్పిస్తాం..
- హుస్సేన్ సాగర్‌నూ ప్రక్షాళన చేయాల్సిఉంది..
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

మూసీ ప్రక్షాళన చేస్తుంటే మీకు అభ్యంతరం ఏంటని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రతిపక్షాలను ప్ర శ్నించారు. మూసీ ప్రక్షాళతో కాంగ్రెస్ కు మంచి పేరు వస్తే రాజకీయ జీవితం ఉండదని బీఆ ర్ఎస్ నేతలు తట్టుకోలేక పోతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడారు. మూసీ రివర్ ప్రక్షాళన తర్వాత 2028 ఎన్నికల్లో హైదరాబాద్ పరిధిలోని అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ సీట్లలో గెలుస్తామని, గ్రేటర్ లో కాంగ్రెస్ తప్ప ఏ ఒక్క పార్టీ కూడా మిగలదన్నారు. హుస్సేన్ సాగర్ ను కొబ్బరి నీళ్లు చేస్తానన్న నాటి కేసీఆర్ మాటలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఇప్పటికైనా హుస్సేన్ సాగర్ ను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉం దని, ఈ విషయమై సీఎం రేవంత్ రెడ్డి చొరవ చూపాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో 10 వేల ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. మేం అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే లక్ష ఉద్యోగాలు ఇస్తున్నాన్నారు. కాంగ్రెస్ ఉద్యోగాల కల్పన లక్ష్యంగా చేసుకొని పోస్టులను భర్తీ చేస్తుందన్నా రు. ఆర్ఎస్ గ్రూప్స్ ఉద్యోగాలు ఇవ్వలేదని, మే ము నియామకాలు చేస్తున్నామన్నారు. గ్రూప్-1 అభ్యర్థులు 80 శాతం హాల్ టికెట్లు డౌన్ లో డ్ చేసుకున్నారన్నారు. పదేళ్లలో కేసీఆర్ ఎన్ని ఇండ్లు కట్టాడో తెలియదని, అయితే మేం మా త్రం నియోజక వర్గానికి 4వేల ఇండ్ల చొప్పున 119 నియోజకవర్గాలలో నాలుగు లక్షల ఇండ్లు కడుతున్నామని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు.



## భద్రాద్రి రామాలయ అభివృద్ధికి రూ. 60 కోట్లు

- స్థల సేకరణకు గ్రామ సభ నిర్వహించిన ఐటీడీఏ పీఓ
- ప్రజలు, వ్యాపారుల నుండి అభ్యంతరాల స్వీకరణ

**జనపదం, భద్రాద్రి :** దక్షణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాద్రి శ్రీ సీతారామ చంద్ర స్వామి ఆలయ అభివృద్ధికి ఓ అడుగు ముందు పడింది. రామాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.60 కోట్లు కేటాయించింది. అయితే, అభివృద్ధికి అవసరమైన స్థలాన్ని సేకరించేందుకు అధికారులు శుక్రవారం శ్రీ కారం చుట్టారు. ఆలయ పరిసర ప్రాంతాల ప్రజలు, వ్యాపారులు, రాజకీయ పార్టీల నేతలతో భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఐటీడీఏ పీవో బి.రాహుల్, రామాలయ కార్యనిర్వహణ అధికారి రమాదేవీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రావు సమక్ష్యంలో ఈ గ్రామ సభ జరిగింది. సభలో ఆలయ అభివృద్ధి కోసం 56 వసతి గృహాలను, చుట్టు ప్రక్కల వ్యాపార సముదాయాలను తొలగించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు. దీనిపై స్పందించిన వివిధ వర్గాల ప్రజలు, ఆలయ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను స్వాగతించారు. కాకపోతే, వ్యాపార సముదాయాలు తొలగించడం వల్ల నష్టపోయిన వ్యాపారులకు శ్వాశ్వత పునరావాసం కల్పించాలని కోరారు. ఆలయ అభివృద్ధిలో భాగంగా వ్యాపార సముదాయాన్ని కూడా నిర్మించి వ్యాపారులకు అద్దెకివ్వాలని సూచించారు. అదే విధంగా స్థలాలు కోల్పోయిన వారికి నష్టపరిహారంతో పాటు మరోచోట స్థలాన్ని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు, ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించిన అధికారుల, ఉన్నతాధికారులకు నివేదిస్తామని హామీ ఇచ్చారు.



## పారదర్శకంగా ఇందిరమ్మ కమిటీలు

- నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అధికారులతో సమీక్ష

**జనపదం, పటాన్ చెరు :** ప్రతి పేదవాడికి సొంతింటి కలను సాకారం చేయాలన్న సమున్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకం ప్రారంభించిందని, పూర్తి పారదర్శకంగా కమిటీలు, లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని సం భందిత శాఖ అధికారులకు పటాన్ చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం పటాన్ చెరు లోని ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ము న్సి పల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులతో ఇందిరమ్మ ఇళ్ల పథకం విధివిధానాలపై ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రభుత్వం సూచించిన నిబంధనలకు అనుగుణంగా గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామ కమిటీలు, వార్డు కమిటీలు ఏర్పాటు చేసి అర్హులైన వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. ఈ పథకం కింద ఇండ్లు నిర్మించుకునే లబ్ధిదారులకు సొంతంగా ఖాళీ స్థలం ఉంటే ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు సాయం అందించడం జరుగుతుందన్నారు. ఎవరైనా స్థలం లేని నిరుపేదలకు అధికారుల పరిశీలన తర్వాత వారి ఖాళీ స్థలంతో పాటు ఇంటి నిర్మాణానికి అవసరమైన ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికలో ఎట్టి పరిస్థితుల్లోనూ అవకతవకలు జరగడానికి వీలు లేదని ఆదేశించారు. త్వరలోనే ప్రభుత్వం లాంఛనంగా ఈ పథకాన్ని ప్రారంభించనుందని తెలిపారు.





## గ్రూప్ 4 ఉద్యోగ అభ్యర్థుల ఆందోళన..

- బ్యాక్‌లాగ్ పోస్టులు ఉంచవద్దని డిమాండ్
- గాంధీ భవన్ వద్ద ఉద్రిక్తత

**జనపదం, హైదరాబాద్ సిటీ :** గాంధీ భవన్ వద్ద గ్రూప్ -4 ఉద్యోగ అభ్యర్థులు శుక్రవారం ఉదయం ఆందోళనకు దిగారు. కొందరు గ్రూప్-2, గ్రూప్ -1 మెయిన్స్ కు ఎంపిక అయిన వారిని గ్రూప్ -4 నుంచి వెంటనే అన్ లివింగ్ చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పోస్టుల్లో ఉన్న వారు అన్ లివింగ్ ఆప్షన్ ఇవ్వాలన్నారు. వారి పోస్టులు వచ్చి వెళ్లిన తర్వాత బ్యాక్ లాగ్‌లుగా ఉంచొ ద్దని, దీని వల్ల వెనకున్న అభ్యర్థులు నష్టపోతారని వాపోయారు. రెండు వేల పోస్టులు ఖాళీ అయ్యే అవకాశం ఉందని, ప్రభుత్వం వెంటనే స్పందించాలని వారు డిమాండ్ చేశారు. కాగా, అభ్యర్థుల ఆందోళనతో గాంధీభవన్ వద్ద కాసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని వారిని నచ్చజెప్పారు. కాగా.. గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షకు లైన్ క్లియర్ అయిన విషయం తెలిసిందే. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పిటిషన్లను హైకోర్టు డిస్మిస్ చేసింది. వివిధ కారణాలతో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై హైకోర్టులో అభ్యర్థులు పలు పిటిషన్‌లు దాఖలు చేశారు. మంగళవారం ఉదయం ఈ పిటిషన్లపై హైకోర్టులో విచారణకు వచ్చింది. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్షలపై దాఖలైన రెండు పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. గ్రూప్ 1లో తప్పుడు ప్రశ్నలను తొలగించాలని ఒక పిటిషన్ దాఖలవగా.. ప్రిలిమీనరీ కీలో తప్పులు ఉన్నాయని, కీ ని రీ నోటిఫికేషన్ చేయాలని మరో పిటిషన్‌ను అభ్యర్థులు దాఖలు చేశారు. తప్పుడు ప్రశ్నలు తొలగించి మళ్లీ మెరిట్ జాబితాను విడుదల చేయాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై ఈరోజు హైకోర్టులో విచారణ జరిగింది. త్వరలో గ్రూప్ వన్ మెయిన్స్ పరీక్షలు జరగబోతున్నాయని ఈ సమయంలో న్యాయస్థానం జోక్యం చేసుకుంటే మెయిన్స్ విద్యార్థులు నష్టపోతారని టీజీపీఎస్సీ కోర్టుకు తెలియజేసింది. ప్రభుత్వ వాదనలతో ఏకీభవించిన హైకోర్టు పిటిషన్‌లను కొట్టివేసింది. దీంతో ఈనెల 21 నుంచి గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలు యథావిధిగా జరుగనున్నాయి.

## బాల్య వివాహాలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

- వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదని స్పష్టం
- కట్టడికి మార్గదర్శకాలు జారీ చేసిన ధర్మాసనం



**జనపదం, న్యూఢిల్లీ :** బాల్య వివాహాల నిరోధక చట్టం అమలుకు వ్యక్తిగత చట్టాలు అడ్డంకి కారాదని దేశ అత్యున్నత న్యా యస్థానం స్పష్టం చేసింది. వ్యక్తిగత చట్టాలతో ఎలాంటి సంబంధం లేకుండా బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అమలు చేయాలని సూచించింది. బాల్యంలో వివాహం చేస్తే, జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకునే స్వేచ్ఛను హరించినట్లే అవుతుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశంలో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని సమర్థంగా అమలు చేసేందుకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన ధర్మాసనం శుక్రవారం మార్గదర్శకాలను జారీ చేసింది. వ్యక్తిగత చట్టాలతో బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని అడ్డుకోవద్దని అభిప్రాయపడింది. బాల్య వివాహాలు మైనర్లకు తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛను హరిస్తాయని పేర్కొంది. బాల్య వివాహాలు, మైనర్ల రక్షణపై అధికారులు దృష్టి సారించాలని సూచించింది. నేరస్తులకు జరిమానా విధించాలని నిర్దేశించింది. 'బాల్య వివాహాలను నివారించాలనే వ్యూహాలు వివిధ వర్గాలకు అనుగుణంగా ఉండాలి. బహుళ రంగాల మధ్య సమన్వయం ఉన్నప్పుడే చట్టం విజయవంతం అవుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులకు దీనిపై శిక్షణ సామర్థ్యాన్ని పెంచాలి. కమ్యూనిటీ ఆధారిత విధానాలు ఉండాలి' అని ధర్మాసనం పేర్కొంది. బాల్య వివాహాల చట్టాల అమలు తీరును ప్రశ్నిస్తూ ఓ ఎన్జీవో వేసిన పిల్‌పై శుక్రవారం సుప్రీంలో విచారణ జరిగింది. బాల్య వివాహం జరిపిన కేసుల్లో వ్యక్తులను శిక్షించినా.. పెద్దగా ఏమీ మార్పు జరగడం లేదని కోర్టు తెలిపింది. పీసీఎంఏ చట్టం అమలు విషయంలో వివిధ వర్గాల ప్రజల మధ్య సహకారం అవసరం అని కోర్టు తెలిపింది. చట్టాల అమలుతో లక్ష్యాలు సాధించేందుకు కొన్ని మార్గదర్శకాలను కోర్టు సూచించింది. తాము సూచించిన మార్గదర్శకాలను అన్ని రాష్ట్రాల చీఫ్ సెక్రటరీలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని మహిళా, శిశు సంక్షేమ శాఖకు ఆదేశాలు ఇచ్చారు. బాల్య వివాహాల నిరోధక చట్టాన్ని 2006లో రూపొందించారు. ఈ చట్టాన్ని 1929 నాటి బాల్య వివాహ నిరోధక చట్టం స్థానంలో తీసుకొచ్చారు.

## ఆలయాల భూములను పరిరక్షిస్తాం..

- త్వరలో స్టేట్ గెజిటన్ నోటిఫికేషన్ జారీ చేస్తాం
- ఆలయ భూముల్లో సోలార్ పవర్ ప్లాంట్లు
- దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**జనపదం, సెక్రటేరియట్ :** రాష్ట్రంలోని దేవాదాయ శాఖ భూముల పరిరక్షణలో భాగంగా స్టేట్ గెజిట్ నోటిఫికేషన్ ఇస్తున్నామని దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. రాష్ట్రంలోని పలు ఆలయాల అభివృద్ధి వివరాలు, భక్తులకు కల్పిస్తున్న వసతుల వివరాలు, దేవాదాయ శాఖ భూముల పరిరక్షణకు చేపడుతున్న చర్యల వివరాలను వివరిస్తూ శుక్రవారం సచివాలయంలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాదాయ శాఖకు చెందిన భూములను పరిరక్షించేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని వివరించారు. దేవాలయాలకు చెందిన భూముల్లో తొలివిడతలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. దేవాదాయ భూములను సర్వే చేసి సైన్ బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు 34 వేల 92 ఎకరాల దేవాదాయ భూములకు జియో ట్యాగింగ్ చేయడం జరిగిందని అన్నారు. 57 శాతం దేవాదాయ భూములను ధరణిలో నిక్షిప్తం చేయడంతో పాటు ఇతరులు ఆ భూములను రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి వీలు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

**ఆలయాల అభివృద్ధికి చర్యలు**

రాష్ట్రంలోని ప్రముఖ ఆలాయాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని కొండా సురేఖ తెలిపారు. రాబోయే బ్రహ్మోత్సవాల నాటికి యాదగిరి గుట్ట దేవాలయ గోపురానికి 60 కిలోల బంగారంతో తాపడం చేస్తున్నామన్నారు. దాతలచే సేకరించిన రూ.15 కోట్ల విరాలాలతో ఉచిత అన్నప్రసాద వితరణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. దీనివల్ల రోజుకు సూమారు 2500 మంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందించే వీలు కలుగుతుందని అన్నారు. అదే విధంగా దూర ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు విశ్రాంతి భవనాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాలినడక భక్తులకు ఎండ నుండి ఉపశమనం కల్పించేందుకు షెడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధి మాస్టర్ ప్లాన్ లో భాగంగా భూ సేకరణ చేసేందుకు రూ. 60 కోట్లు మంజూరు చేయడం జరిగిందని అన్నారు. వీటితో పాటు వేములవాడ, భాసర వంటి ప్రముఖ ఆలయాల అభివద్ధికి ప్ర త్యేక ప్రణాళికలు రూపొందించడం జరిగిందన్నారు. భవిష్యత్తులో అన్ని దేవాలయాల వెబ్ సైట్ లను ఒకే గొడుగుకిందకు తీసుకు వచ్చి దేవాదాయ శాఖ సమగ్ర వెబ్ సైట్ ను తయారు చేయబోతున్నామన్నారు. త్వరలో దేవాదాయ శాఖ యాప్ ను ఏర్పాటు చేయడంతో పాటు క్యూఆర్ కోడ్ విధానం ద్వారా భక్తులు తమకు ఇష్టం వచ్చిన దేవాలయాల వివరాలు స్థల పురాణాలు తెలుసుకునే వీలు కల్పిస్తున్నామన్నారు.

**ఉద్యోగుల సంక్షేమం కోసం..**

గత 15 సంవత్సరాలుగా బదిలీలు లేకుండా ఒకే చోట పనిచేస్తూ ఇబ్బందులు పడుతున్న ఉద్యోగులకు ఉపశమనం కల్పిస్తూ భారీగా బదిలీలు చేపట్టమన్నారు దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ. దేవాదాయ శాఖలోనే ఇది రికార్డు అన్నారు. ప్రెసిడెన్, యల్ ఆర్డర్ 2018 వచ్చిన తర్వాత జోనల్ సిస్టమ్ ప్రకారం సబార్డినేట్ సర్వీస్ రూల్స్ ను సవరించుకున్నామని అన్నారు. చాలా రోజులుగా దేవాదాయ శాఖలో ఉద్యోగుల సమస్యలను పరిష్కరించామని తెలిపారు.

# ఆయియే ఆదానీ జీ.. యే లేలో రేవంత్ జీ..

- స్కిల్ యూనివర్సిటీకి ఆదానీ గ్రూప్ భారీ విరాళం
- 100 కోట్ల సాయం అందజేసిన గౌతమ్ అదానీ
- సీఎం రేవంత్ రెడ్డికి చెక్కు అందజేత
- యువతకు ఉపాధే లక్ష్యం..
- నవంబర్ 4 నుంచి కోర్సులు ప్రారంభం



జనపదం, బిజినెస్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ఇచ్చింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. యువతకు ఉపాధి అవకాశాలు మెరుగయ్యే లక్ష్యంతో వారిలో నైపుణ్యాలు పెంపొందించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అదానీ గ్రూప్ భారీ విరాళం ప్రకటించింది. ఈ మేరకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ శుక్రవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి రూ.100 కోట్ల చెక్కును అందజేశారు. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ఈ సమావేశంలో అదానీ గ్రూప్ ఫౌండేషన్ ప్రతినిధులు, సీఎస్ శాంతికుమారి, ఇతర అధికారులు ఉన్నారు.కాగా, ఇటీవలే స్కిల్ వర్సిటీ వీసీ సహా బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్, ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్, ఇతర నియామకాలు చేపట్టారు. వర్సిటీ వీసీగా కేంద్ర ప్రభుత్వంలో ప్రిన్సిపల్ ఎకనమిక్ అడ్వయిజర్‌గా పదవీ విరమణ చేసిన వీఎల్‌వీఎస్ఎస్ సుబ్బారావు పేరు ఖరారు చేశారు. యూనివర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా పారిశ్రామిక దిగ్గజం ఆనంద్ మహీంద్రాను నియమించారు. రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలోని బేగరికంచెలో తెలంగాణ ప్రభుత్వం స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు ఇటీవల సీఎం రేవంత్ శంకుస్థాపన చేశారు. బేగరికంచెలో సొంత భవనం పూర్తయ్యే వరకూ గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా భవనంలో వర్సిటీ కార్యకలాపాలు కొనసాగనున్నాయి. 17 రకాల కోర్సుల్లో యువతకు శిక్షణ ఇచ్చి ప్రైవేట్ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. ఏటా లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా రాబోయే కాలంలో ఈ వర్సిటీని విస్తరించనున్నారు. ఈ ఏడాది నుంచే ప్రవేశాలు కల్పించాలనే ఉద్దేశంతో ఇప్పటికే దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. నవంబర్ 4వ తేదీ నుంచి స్కిల్ యూనివర్సిటీలో కోర్సులు ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతానికి ప్రాధాన్యం ఉన్న 6 కోర్సులతో మొదలు పెట్టి తర్వాత కోర్సులు పెంచనున్నారు.

# వీసీలొచ్చారు..

- 9 యూనివర్సిటీలకు వైస్ చాన్స్ లర్ల నియామకం
- ఫుల్ టైం నియామకంతో సర్వత్రా హర్షం..
- ఓయూ వైస్ ఛాన్సలర్‌గా కుమార్

జనపదం, హైదరాబాద్ సిటీ: రాష్ట్రంలోని 9 యూనివర్సిటీలకు వైస్ ఛాన్సలర్లను ప్రభుత్వం నియమించింది. వీసీల నియమాక ఉత్తర్వులపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేశారు. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. ఓయూ వైస్ ఛాన్సలర్‌గా ప్రొఫెసర్ కుమార్‌ను నియమించారు. ఇందులో ఉస్మానియా, కాకతీయ, మహాత్మా గాంధీ, తెలంగాణ, పాలమూరు, తెలుగు యూనివర్సిటీ, శాతవాహన, అగ్రికల్చర్ యూనివర్సిటీ, హార్టికల్చర్ యూనివర్సిటీలు ఉన్నాయి.





| యూనివర్సిటీ | కొత్త వీసీ |
|---|---|
| ఉస్మానియా యూనివర్సిటీ | ప్రొఫెసర్ కుమార్ |
| కాకతీయ యూనివర్సిటీ | ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి |
| మహాత్మా గాంధీ యూనివర్సిటీ | ప్రొఫెసర్ అల్తాఫ్ హుస్సేన్ |
| తెలంగాణ యూనివర్సిటీ | ప్రొఫెసర్ యాదగిరి రావు |
| పాలమూరు యూనివర్సిటీ | ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ |
| తెలుగు యూనివర్సిటీ | ప్రొఫెసర్ నిత్యానందరావు |
| శాతవాహన యూనివర్సిటీ | ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ |
| ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ | అల్దాస్ జానయ్య |
| కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం | ప్రొఫెసర్ రాజిరెడ్డి |



# నిర్వాసిత మహిళలకు రుణాలు

- ఒక్కొక్కరికి రూ.2 లక్షలు
- రూ.1.40 లక్షలు సబ్సిడీ
- చెక్కులను అందించిన మంత్రి సీతక్క
- మహిళలకు వ్యాపారాల కోసం రుణాలు ఇస్తున్నాం
- మూసీ పరివాహకంలో కాకుండా మంచి వాతావరణంలో బతకాలి : మంత్రి సీతక్క



**జనపదం, హైదరాబాద్ సిటీ:** మూసీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వారికి పునరావాసం కల్పించి, వారి ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి న్యాయం చేస్తుందని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. శుక్రవారం ప్రజా భవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో మూసీ పరివాహక ప్రాంతాల స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ. 3.44కోట్లను 172 మంది మహిళలకు ఒక్కొక్కరికి 2 లక్షల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వెళ్ళేటప్పుడు జరిగే బాధను గుర్తుచేస్తూ, ఇటీవల ఖమ్మం, మహబూబాబాద్ వంటి ప్రాంతాలు వరదల వల్ల నష్టపోయాయన్నారు. అలాగే మూసీ మురికి నీటి కారణంగా అనారోగ్య సమస్యలు వచ్చాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆ నీటిని త్రాగదగిన స్థాయికి తీసుకురావడానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో బాధిత మహిళలకు రూ. 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామని, అందులో రూ. 1.40 లక్షలు సబ్సిడీగా ఉంటాయని, మిగిలిన రూ. 60 వేల రూపాయలు మూడు సంవత్సరాల్లో చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా వివిధ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. అనుకోకుండా వరదలు వచ్చినప్పుడు ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సన్నద్ధంగా ఉంటామని తెలిపారు. పునరావాసం పొందిన బాధిత కుటుంబాలకు ఉచిత విద్య, అంగన్వాడీ కేంద్రాలలో ప్రవేశం, అలాగే రెండు పడకల గదుల నిర్మాణం ఉచితంగా అందించామని చెప్పారు.

మూసీ రివర్ పరిరక్షణలో జిహెచ్ఎంసి అర్బన్ డెవలప్మెంట్ విభాగం ఆధ్వర్యంలో బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాగా కృషి చేశారని మంత్రి సీతక్క ప్రశంసించారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు జిహెచ్ఎంసి కమిషనర్ కృషి మేరకు బాధిత కుటుంబాలకు న్యాయం చేకూర్చడం ముఖ్య భూమిక పోషించినట్లు పేర్కొన్నారు. ఇక నుండి కూడా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రక్షాళన జిహెచ్ఎంసి పాత్ర కీలకమని మంత్రి సీతక్క ప్రశంసించారు.

మలక్ పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ బలాల మాట్లాడుతూ... మలక్ పేట్ నియోజకవర్గంలో మూసీ పరివాహక ప్రాంతంలో వరదలు వచ్చినప్పుడు పునరావస కేంద్రాలకు తరలించేవారమని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, మూసీ నిర్వాసితులకు పిల్లి గుడిసె 2 బిహెచ్ కె కాలనీలో 130 కుటుంబాలకు పునరావాసం కల్పించామని తెలిపారు. మూసీ లో చాలా మంది బాధ పడ్డారని ఇప్పుడు ఏ బాధ ఉండదని తెలిపారు. వాటర్ సమస్యను పరిష్కరించడానికి ఆర్ ఓ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ శాసన సభ్యులు అహ్మద్ బిన్ బలాల, కౌసర్ మొహమందిన్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డిలతో పాటు సేర్ప్ సి ఇ ఓ దివ్య దేవరాజ్, మూసీ జె డీఎం గౌతమి, శ్రీనివాస్ రెడ్డి, మూసీ ఈ డి, ఎస్.సి కార్పొరేషన్ ఎండి మల్లయ్య భట్టు, డి ఈ ఓ తదితరులు పాల్గొన్నారు.

## లాఠీచార్జ్ కరెక్ట్ కాదు..

### ఖండించిన కేటీఆర్



జనపదం, అశోక్ నగర్: అశోక్ నగర్ లో విద్యార్థుల పైన జరిగిన లాఠీచార్జ్ ను భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీసుల జులుం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ తెలంగాణ ఉద్యమం నాటి అణచివేత చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. అమ్మాయిలని కూడా చూడకుండా ఇంత దుర్మార్గంగా వ్యవహరించిన రేవంత్ సర్కార్ను తెలంగాణ ప్రజలు క్షమించరని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అశోక్ నగర్ కు వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పత్తా లేకుండా పోవడం దుర్మార్గమన్నారు. గ్రూప్... 1 అభ్యర్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు.అరెస్ట్ చేసిన విద్యార్థులను, గ్రూప్ 1 అభ్యర్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.



# ఎందాకైనా కొట్లాడతా

- మీకోసం దేనికైనా రెడీ..
- ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు జీవో 29 గొడ్డలిపెట్టు
- గ్రూప్ 1 పరీక్షలను రీషెడ్యూల్ చేసేదాకా ఉద్యమిస్తా
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ హామీ
- అభ్యర్థులకు భరోసా..

**జనపదం, హైదరాబాద్ సిటీ:** గ్రూప్ 1 పరీక్షల రీషెడ్యూల్ కు పట్టుపడుతున్న అభ్యర్థుల డిమాండ్ కు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.29 ఎస్సీ, ఎస్టీ, బీసీ నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని మండిపడ్డారు. తక్షణమే ఆ జీవోను ఉపసంహరించుకోవడంతోపాటు గ్రూప్ 1 పరీక్షల్లో జరిగిన తప్పిదాలను సవరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో నిరుద్యోగులకు న్యాయం జరిగేంతవరకు కొట్లాడతానని ప్రకటించారు.

కరీంనగర్ లోని ఎంపీ కార్యాలయానికి పెద్ద ఎత్తున గ్రూప్ 1 అభ్యర్థులు తరలివచ్చారు. ప్రభుత్వం జారీ చేసిన 29 జీవోవల్ల తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని పేర్కొంటూ కేంద్ర మంత్రికి వినతి పత్రం సమర్పించారు. గ్రూప్ 1 పరీక్షల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక తప్పిదాలకు పాల్పడిందని వాపోయారు. ముఖ్యంగా రాజ్యాంగ స్ఫూర్తిగా భిన్నంగా జారీ చేసిన జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులమైన తామంతా తీవ్రంగా నష్టపోతున్నామ ని పేర్కొన్నారు. గ్రూప్ 1 ప్రిలిమనరీ పరీక్షల్లో అర్హులై న వారికి, మెయిన్స్ పరీక్షకు జారీ చేసిన హాల్ టిక్కె ట్లకు మధ్య చాలా వ్యత్యాసం ఉందని, అదనంగా 4 వేల మందికి పైగా హాల్ టిక్కెట్లు ఇచ్చారని వాపో యారు. ప్రశ్నిస్తే పోలీసులతో లాఠీ ఛార్జ్ చేయిస్తున్నరు. అరెస్టులు చేసి జైళ్లో వేస్తున్నరు. ''నిరుద్యోగుల పక్షాన మీరే మొదటి నుండి పోరాడుతున్నరు. మీరే మాకు అండ. మాకు న్యాయం చేయండి''అని మొరపెట్టుకున్నారు. ఈ సందర్భం గా గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనకు సంపూర్ణ మద్దతిస్తున్నట్లు కేంద్ర మంత్రి ప్రకటించారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా జారీ చేసిన జీవో 29ను వెంటనే రద్దు చేసేదాకా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని హామీ ఇచ్చారు. మరోవైపు కొద్దిసేపటి క్రితం హైదరాబద్ లో నిరుద్యోగులపై పోలీసులు లాఠీ చార్జ్ చేసిన విషయం తెలుసుకున్న బండి సంజయ్ రాష్ట్ర ప్రభుత్వ తీరును తప్పుపట్టారు. ఈ విషయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్ లోని అశోక్ నగర్ వెళ్లి నిరుద్యోగుల ఆందోళనకు మద్దతు ప్రకటించేందుకు బండి సంజయ్ సిద్ధమయ్యారు.





# సుందరీకరణకు వ్యతిరేకం కాదు..

- ముందు ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించండి
- పేదల ఇండ్లను కూడా కూల్చవద్దు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**జనపదం, హైదరాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ సుందరీకరణను, పునరుజ్జీవన చర్యలను తాము వ్యతిరేకించడం లేదని, ముందుగా మూసీ నదికి ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మించి, అభివృద్ధి చేయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో గత 40 సంవత్సరాలుగా నిర్మించుకున్న ఇండ్లను కూల్చివేయవద్దని, మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లను కూల్చడం న్యాయం కాదని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా మూసీ సుందరీకరణ చేయాలని కోరారు. ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని గాంధీ నగర్ డివిజన్, హరిత అపార్ట్మెంట్ లైన్, ఆంధ్ర కేఫ్ క్రాస్ రోడ్ లో స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్ గారితో కలిసి సేవరేజ్ లైన్ ను కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో అనేక ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో అనేక ప్రాంతాల్లో మంచినీటి పైపులైన్లలో మురుగు నీరు కలవడంతో రోగాన బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలంలో నీటమునిగి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థ అవసరం అని, నగరంలో డ్రైనేజీ వ్యవస్థను దశలవారీగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించకుండా, అభివృద్ధి చేయకుండా హైదరాబాద్ మూసీ సుందరీకరణ చేయడం వీలుకాదని, దాంతోపాటు ఇతర అభివృద్ధి పనులు ముందుకు వెళ్లలేవని కిషన్ రెడ్డి అన్నారు.

రాష్ట్ర జనాభాలో 30 శాతం జనాభా హైదరాబాద్ నగరంలో ఉంటున్నారని, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా హైదరాబాద్ నగర అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం నిధుల కేటాయింపులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స డిపార్ట్ మెంట్ కు అరకొర నిధులు మాత్రమే విడుదల చేయడంతో హైదరాబాద్ నగరంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, నగరంలో పౌర సౌకర్యాలు కల్పించేలా జీహెచ్ఎంసీ, మెట్రో వాటర్ వర్క్స కు నిధులు కేటాయించాలన్నారు. హైదరాబాద్ అంటే కేవలం హైటెక్ సిటీ, మాదాపూర్, కొండాపూర్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాలే కాదనేది ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థను పునరుద్ధరించేలా, అండర్ గ్రౌండ్ పైపులైన్లను మెరుగుపర్చేలా శాశ్వత ప్రాతిపదకన పరిష్కారం చూపేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కేవలం మూసీని సుందరీకరణ చేస్తామంటూ సరిపోదన్నారు. మూసీ సుందరీకరణకు తాము అడ్డు కాదని, పేదలు ఉండే ప్రాంతాల్లో మౌలిక వసతులు కల్పించాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి పేర్కొన్నారు.



# మూసీపై ముష్టియుద్ధం..

**కంపు రేపుతున్న పార్టీల పైత్యం..**
**సిగపట్లకు దిగుతున్న నాయకులు..**
**ఎవరి లెక్కల్లో వాళ్లు.. ఎదుటివారిపై తప్పుల నిందలు..**
**రాజకీయానికి వేదికగా రాజధాని నది..**
**ప్రజలకు ఒరిగింది శూన్యం..**

జనపదం, బ్యూరో: మూసీ చుట్టు రాజకీయం ముందురుతూనే ఉంది. నిర్మాణాల తొలగింపుతో ముదిరిపాకాన పడిన వ్యవహారం ఇప్పుడు రోజుకో మలుపు తిరుగుతూ రక్తికట్టిస్తున్నది. పేదలను మురికి కూపంలోనే ఉంచాలా.., వాళ్లు అందరిలా బతకడం ఇష్టం లేదా.. ? అధికార పార్టీ ఆగ్రహం వ్యక్తం చేస్తుండగా, అన్యాయంగా కట్టడాలు కూల్చుతూ జీవితాలను నాలుగు రోడ్ల కూడలిలో నిలబెట్టి పైశాచికం పొందుతున్నారని, బీదవాడి ఉసురు తాకకుండా పోదని ప్రతిపక్షం బీఆర్ఎస్ దుయ్యబడుతున్నది. అదే క్రమంలో బీజేపీ కూడా కలుగ జేసుకుని కారోళ్లు ఆజ్యం పోశారు., కాంగ్రెసోళ్లు పూర్తి చేస్తున్నారని వారిదైన శైలిలో విరుచుకుపడుతున్నారు.

**కంపు రేపుతున్న పార్టీల పైత్యం..**

నిత్యం పార్టీలకు ఇప్పుడు మూసీ వివాదం తప్ప మరోటి ప్రధానమైనది లేదు. అధికార పక్షం ఏమంటుందా.., దానికి ఎప్పుడెప్పుడు కౌంటర్ ఇద్దామా.. అని ప్రతిపక్షం ఎదురు చూస్తుండగా, మొన్నటి దాకా వెలబెట్టినవాళ్లు ఇప్పుడు ఏదేదో వాగుతూ అనవసరంగా రాజకీయం చేస్తున్నారని, వాళ్ల చేతులను వారి నెత్తిమీదే పెట్టి ప్రజాక్షేత్రంలో మరోమారు భరతం పట్టాల్సిందే అనే ధోరణిలో అధికార కాంగ్రెస్ కాచుక్కూర్చున్నది. వాళ్లతో ఇలాగే జరుగుతుంది., మేం వస్తే మీరు గుండె మీద చేతులేసుకుని బతుకొచ్చు.., అవకాశం ఇవ్వండి., వాళ్ల ఆటలు కట్టించండి అన్నట్టుగా బీజేపీ ప్రవర్తిస్తున్నది. ఒక్కో పార్టీ ఒక్కో వాదాన్ని నెత్తికెత్తుకుని గడుపుతున్న తీరు, సాగదీస్తున్న విధానం మూసీ పరివాహక ప్రజలకేమోగానీ, మూసీకైతే తీవ్ర అసౌకర్యంగానే మారి ఉండొచ్చన్నా ఆశ్చర్యపోవాల్సిన పని లేదు.

# లాఠీ.. లడాయి..

**(మొదటిపేజీ తరువాయి)** పరీక్షకు సంబంధించి హాల్‌టికెట్స్ కూడా విడుదలయ్యాయి. అయితే ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్న మెయిన్స్ పరీక్షలను వాయిదా వేయాలని అభ్యర్థులు మరోసారి నిరసనలకు దిగారు. ఈ పరీక్షల్లో రిజర్వేషన్లు పాటించడం లేదని మండిపడ్డారు. జీవో 29 ని సవరించిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో ప్రిలిమ్స్ పరీక్షల్లోని తప్పులను సవరించాలని కోరారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి అశోక్‌నగర్‌లో ఉద్రిక్త నెలకొంది. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు అభ్యర్థులను అదుపులోకి తీసుకున్నారు. అప్పటి నుంచి నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి.



**సుప్రీంకోర్టులో పిటిషన్**

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 29ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టు తలుపుతట్టారు. అప్పటివరకు పరీక్షను వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినప్పటికీ సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో గ్రూప్-1 అభ్యర్థులు పేర్కొన్నారు. విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం విచారణను సోమవారానికి వాయిదా వేసింది. జీవో 29 మా పాలిట శాపంగా మారిందని పలువురు అభ్యర్థులు వాపోతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ను రద్దు చేయాలని రాష్ట్రంలోని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని క్యాండిడేట్స్ కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని వారు కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా అందుకు హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం నియామకాలనేవి తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే తాజాగా గ్రూప్ -1 అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

**అశోక్ నగర్లో మళ్లీ ఆందోళన**

గ్రూప్-1 పరీక్షలను రద్దు చేయాలంటూ పలువురు అభ్యర్థులు గత రెండు రోజులుగా ఆందోళన చేస్తున్నారు. బుధవారం అశోక్నగర్లో ఆందోళన చేయగా.. గురువారం హైదరాబాద్ గాంధీనగర్లోని పార్కుకు పెద్ద ఎత్తున తరలివచ్చిన అభ్యర్థులు ఈ నెల 21 నుంచి నిర్వహించే పరీక్షలను రద్దు చేయాలని కోరారు. గ్రూప్-1పై ఉన్న కేసులన్నీ తొలగిన తర్వాతే మెయిన్స్ పరీక్ష నిర్వహించకపోతే తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని అభ్యర్థులు వాపోయారు. ఈ పరీక్ష రీ షెడ్యూల్ చేయాలని కోరుతూ శుక్రవారం అశోక్‌నగర్‌లో అభ్యర్థులు మరోసారి ఆందోళనకు దిగారు. మెయిన్స్ పరీక్షను వాయిదా వేయాలని డిమాండ్ చేస్తూ రోడ్లపైకి చేరుకుని నినాదాలు చేస్తు ర్యాలీ చేపట్టారు. ప్లకార్డులతో రోడ్లపైకి వచ్చిన 16 మందిని పోలీసులు అరెస్టు చేసి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసులు లాఠీ ఛార్జి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. వందల సంఖ్యలో చేరుకున్న అభ్యర్థులు గతంలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షల్లో తప్పులు, జీవో 29 సవరించిన తర్వాతే పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1 అభ్యర్థుల ఆందోళనల నేపథ్యంలో అశోక్‌నగర్‌లో పోలీసు పహారా కొనసాగుతోంది.

**అనాలోచిత నిర్ణయం : కేంద్రమంత్రి బండి**

జీవో 29 ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమని కేంద్ర హోం సహాయక మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళనతోనే కాంగ్రెస్ ప్రభుత్వం మనుగడే ప్రశ్నార్థంగా మారే ప్రమాదముందని హెచ్చరించారు. జీవో 29 ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లకు గొడ్డలిపెట్టుగా అభివర్ణించారు. గ్రూప్ 1 అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. నిరుద్యోగులపై లాఠీఛార్జ్ చేయడం అమానుషమన్నారు. మరోవైపు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభ్యర్థులపై లాఠీఛార్జీని ఖండించారు. గ్రూప్ -1 అభ్యర్థులకు తమ పార్టీ అండగా ఉంటుందని ప్రకటించారు.

**నిరుద్యోగులకు అన్యాయం : కేటీఆర్**

అశోక్ నగర్ లో విద్యార్థుల పైన జరిగిన లాఠీచార్జ్ పై స్పందించిన బీఆర్ఎస్వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఖండించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాలతోనే నిరుద్యోగులపై పోలీసుల జులుం చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మళ్లీ తెలంగాణ ఉద్యమం నాటి అణచివేత చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. అమ్మాయిలని కూడా చూడకుండా ఇంత దుర్మార్గంగా వ్యవహరించిన రేవంత్ సర్కార్ను తెలంగాణ ప్రజలు క్షమించరని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఇదే అశోక్ నగర్ కు వచ్చి అడ్డగోలు హామీలు ఇచ్చిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పత్తా లేకుండా పోవడం దుర్మార్గమన్నారు. గ్రూప్... 1 అభ్యర్థులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందన్నారు.అరెస్ట్ చేసిన విద్యార్థులను, గ్రూప్ 1 అభ్యర్థులను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

Printed and Published Mallika. On behalf of Sri Krishna Vande Jagadgurum Publications, Published at Banjara Hills Road , Erramazill 6-3-562-14, Hyderabad - Telangana 500082.
Printing at Colour Graphics, 2-6-652/12, Amberpet Musarambagh Road ,Hyderabad, 500013 Telangana. Editor Sramik (Responsible for selection of News under the PRB act )
Reg no APTEL / 2012/46581, Phone Number 9849290606, Email ID : janapadham0606@gmail.com